సిట్టింగ్‌లకే ప్రాధాన్యత

◆ పాయకరావుపేట, అనకాపల్లి, గాజువాక, విశాఖ తూర్పు, పశ్చిమల్లో మాత్రం కొత్త అభ్యర్థులు

◆ ఎంపికలో వైసిపి వడపోత ◆ పెండింగ్‌లో అనకాపల్లి ఎంపీ టికెట్

ఎం.శ్రీనివాసరావు (భీమిలి)

ఆడారి ఆనంద్ (విశాఖ పశ్చిమం)

గుడివాడ అమర్‌నాథ్ (గాజువాక)

కెకె.రాజు (విశాఖ ఉత్తరం)

బొత్స ఝూన్సీ (విశాఖ ఎంపీ స్థానం)

ఎంవివి.సత్యనారాయణ (విశాఖ తూర్పు)

వి.గణేష్ కుమార్ (విశాఖ దక్షిణం)

అదీప్‌రాజ్ (పెందుర్తి)

బి.ముత్యాలనాయుడు (మాడుగుల)



కన్నబాబు రాజు (యలమంచిలి)

కరణం ధర్మశ్రీ (చోడవరం)

ఎం.భరత్ కుమార్ (అనకాపల్లి)

పి.ఉమాశంకర్ గణేష్ (నర్సీపట్నం)

కంబాల జోగులు (పాయకరావుపేట)

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

జిల్లాలోని పెందుర్తితో సహా ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఐదు స్థానాలను సిట్టింగ్ ఎమ్మెల్యేలకు వైసిపి కేటాయించింది. రెండు నియోజకవర్గాల్లో అభ్యర్థులను మార్చింది. శనివారం అభ్యర్థుల ప్రకటనతో సిట్టింగ్‌లు ఊపిరి పీల్చుకున్నారు. అనకాపల్లి ఎంపీ స్థానం బిసికి కేటాయించినా.. అభ్యర్థిని మాత్రం ప్రకటించలేదు. సిట్టింగ్ ఎంపీ డాక్టర్ సత్యవతి, యలమంచిలి పురపాలక సంఘం చైర్‌పర్సన్, పశ్చిమ నియోజకవర్గ వైసిపి అభ్యర్థి ఆడారి ఆనంద్ కుమార్ సోదరి రమాకుమారి పేర్లు పరిశీలనలో ఉన్నాయి. టిడిపి, జనసేన, బిజెపి పొత్తులో అనకాపల్లి నుంచి సిఎం రమేష్ పోటీలో ఉంటే, ఆయనకు ధీటైన వ్యక్తిని బరిలోకి దించాలని వైసిపి అధినేత జగన్మోహన్ రెడ్డి యోచిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. సామాజిక సమీకరణ, రాజకీయ బలానికి తోడు ఆర్థికంగా తట్టుకోగలిగిన శక్తి రమాకుమారికి ఉండడంతో ఆమెకు తొలి ప్రాధాన్యత ఇచ్చే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. సిట్టింగ్‌ల్లో చోడవరం, పెందుర్తి ఎమ్మెల్యేలకు ఈ సారి టికెట్లు రావని కొంతకాలం క్రితం ప్రచారం జరిగింది. బలహీనతలు అధిగమించి, ఆరోపణల నుంచి బయటపడకపోతే టికెట్ ఇవ్వడం కష్టమేనన్న సంకేతాలు పార్టీ అధిష్టానం ఇచ్చింది. దీంతో వారు కొన్ని జాగ్రత్తలు తీసుకున్నారు. దీనికితోడు ఆ నియోజకవర్గాల్లో ఆ స్థాయి కలిగిన నాయకులు లేకపోవడంతో వారికి మళ్లీ టికెట్లు కేటాయించారు. ఇక అనకాపల్లి, పాయకరావుపేల్లో కొత్త అభ్యర్థులను బరిలో పెట్టింది. అనకాపల్లి నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రి అమర్‌నాథ్ స్థానంలో మలసాల భరత్ కుమార్, పాయకరావుపేట ఎమ్మెల్యే జి.బాబూరావు స్థానంలో రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులకు టికెట్ ఇచ్చారు.

విశాఖలో ఊహించిన వారికే టిక్కెట్లు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో : వైసిపి ప్రకటించిన ఎమ్మెల్యే అభ్యర్థుల జాబితాకు సంబంధించి విశాఖ జిల్లాలో ఊహించిన వారికే ఆయా స్థానాలు దక్కడంతో ఆ పార్టీ నేతలు ఊపిరి పీల్చుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పలు సెగ్మెంట్లలో పోటీ చేసే నేతలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మార్చుతున్న నేపథ్యంలో విశాఖలోనూ ఈ సీను ఉంటుందని పలువురు ఊహించారు. కానీ ఎక్కడ వారిని అక్కడ నిలబెట్టే ప్రయత్నం వైసిపి అధిష్టానం చేసింది. పెందుర్తి ఆదీప్‌రాజుకు, విశాఖ తూర్పు ఎంవివి.సత్యనారాయణకు, పశ్చిమం ఆడారి ఆనంద్‌కుమార్‌కు, ఉత్తరం కెకె.రాజుకు, పశ్చిమం వాసుపల్లి గణేష్‌కుమార్‌కు, భీమునిపట్నం ముత్తంశెట్టి శ్రీనివాసరావుకు ఖరారు చేశారు. గాజువాక అనూహ్యంగా గుడివాడ అమర్‌నాథ్‌కు దక్కింది. విశాఖ ఎంపీ స్థానం బొత్స ఝాన్సీకి దక్కింది.

ఉత్సాహంగా ఉక్కు రక్షణ సభ

◆ భారీగా తరలివచ్చిన ప్రజలు, కార్మికులు

◆ ఆకట్టుకున్న తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి ప్రసంగం

సభకు భారీగా హాజరైన జనం

మాట్లాడుతున్న సిహెచ్.నర్సింగరావు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో, గాజువాక

ఉక్కునగరంలోని తృష్ణా గ్రౌండ్‌లో స్టీల్‌ప్లాంట్ డిక్లరేషన్‌పై శనివారం సాయంత్రం ఏర్పాటు చేసిన కాంగ్రెస్ సభ విజయవంతమైంది. వందలాది మంది కార్మికులు, ప్రజలు ఈ సభకు తరలివచ్చారు. సభకు ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ 32 మంది ప్రాణ త్యాగాలతో సాధించుకున్న విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రధాని నరేంద్ర మోడీ విక్రయిస్తుంటే ఎపిలోని ప్రధాన పార్టీలైన వైసిపి, టిడిపి ప్రశ్నించకపోవడం దారుణమన్నారు. అందరూ కలిసి పోరాడితే ఢిల్లీ సుల్తానులు, జాగీరార్దులు, పాలకులు ఎవరైనా తలవంచాల్సి ఒదేనన్నారు. ఆయన ప్రసంగం ఆద్యంతం ఆకట్టుకుంది. ఎపిసిసి అధ్యక్షురాలు వైఎస్.షర్మిల మాట్లాడుతూ విశాఖ ఉక్కు కర్మాగారం కేంద్రం కుట్రలకు బలైపోతోందన్నారు. 2014 వరకూ లాభాల్లో నడిచిన స్టీల్‌ప్లాంట్ తర్వాత కాలంలో నష్టాల్లోకి వెళ్లడం వెనుక సొంత గనుల సమస్య ఉందన్నారు. దొంగలు దొంగలు కలిసి దోచుకుని తిన్నట్టుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్లాంట్‌ను నష్టాల్లోకి నెట్టాయన్నారు. 'జగన్ వచ్చాక ఏం చేశారు ? రూ.50 వేల కోట్ల ఆస్తిని రూ.6500 కోట్లకే అదానీకి కట్టబెట్టారు. పోచమ్మ పోగుచేస్తే మైసమ్మ మాయ చేసిందన్నట్టుగా జగన్ వ్యవహారం ఉంది' అని షర్మిల వ్యాఖ్యానించారు. జగన్ ఒక సిద్ధం సభకు రూ.90 కోట్లు ఖర్చు చేశారని తెలిపారు. ప్రజలను మోసం చేయడానికే ఆయన సిద్ధమయ్యారన్నారు. సిపిఎం సీనియర్ రాష్ట్ర నాయకులు సిహెచ్.నర్సింగరావు మాట్లాడుతూ దేశ అభివృద్ధి ప్రభుత్వ రంగ సంస్థలతోనే ముడిపడి ఉందని నాటి ప్రధాని నెహ్రూ చెప్పిన విషయాన్ని ఉటంకించారు. ప్రస్తుత ప్రధాని మోడీ 100 శాతం వ్యూహాత్మక అమ్మకానికి స్టీల్‌ప్లాంట్ విషయంలో నిర్ణయం తీసుకున్నారని, సిపిఎం, సిపిఐ, కాంగ్రెస్ దీనిపై పోరాడుతున్నాయని అన్నారు. గడిచిన పదేళ్లలో బిజెపికి పార్లమెంట్‌లో టిడిపి, వైసిపి మద్దతిస్తూ రాష్ట్రానికి ద్రోహం చేశాయని అన్నారు. వచ్చే ఎన్నికల్లో బిజెపిని, దానికి అంటకాగే పార్టీలను ఓడించాలని పిలుపునిచ్చారు. సిపిఐ జాతీయ నాయకులు కె.నారాయణ మాట్లాడుతూ బడుగు, బలహీన తరగతులందరికీ ఉపాధినిచ్చి అక్కున చేర్చుకునేవి ప్రభుత్వ రంగ సంస్థలేనన్నారు. వాటిని రక్షించుకోవాల్సి ఉందన్నారు. సభలో కాంగ్రెస్ సీనియర్ నేతలు జెడి.శీలం, మాజీ కేంద్ర మంత్రి పల్లంరాజు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం, విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు, ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు జె.అయోధ్యరామ్, ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, మాజీ పిసిసి అధ్యక్షులు ఎన్.రఘువీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు. సభలో భాగంగా విశాఖ ఉక్కుపై తీసిన సినిమా ట్రైలర్‌ను అతిథులు లాంచ్ చేశారు. అలాగే టిడిపి రాష్ట్ర కార్యదర్శిగా మొన్నటి వరకూ పనిచేసిన పాసర్ల ప్రసాద్ కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు.

ఎన్నికలొచ్చేశాయ్..!

అమల్లోకి కోడ్ - కొత్త పనులకు బ్రేక్

ఎన్నికల ఏర్పాట్లుపై సమీక్షిస్తున్న విశాఖ ప్రధాన ఎన్నికల అధికారి మల్లికార్జున

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి : సార్వత్రిక ఎన్నికల గంట మోగింది. కేంద్ర ఎన్నికల సంఘం శనివారం ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసింది. దీంతో వెంటనే ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. తద్వారా కొత్తగా పనుల శంకుస్థాపనకు అవకాశంలేదు. మంత్రులు, ఎమ్మెల్యేల సమీక్షించ వీలులేదు. ప్రొటోకాల్ ఉండదు. జిల్లాలో ప్రభుత్వ యంత్రాంగం ఎన్నికల ఏర్పాట్లన్నీ ఇప్పటికే పూర్తి చేసింది, ఎలక్షన్స్‌కు కలెక్టర్ రవి పట్టాన్ శెట్టి, ఎస్పీ కెవి.మురళీకృష్ణ సిబ్బందిని సమాయత్తం చేశారు. జిల్లాలో 1529 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయి. వీటిలో 332 పోలింగ్ స్టేషన్లు సమస్యాత్మకమైనవని గుర్తించారు. వీటిలో ఎన్నికలు సజావుగా జరిగేలా ప్రణాళిక తయారుచేశారు. ఎన్నికల నిర్వహణకు 10 వేల సిబ్బంది అవసరమని అంచనావేసి తొలిదశ శిక్షణ పూర్తి చేశారు. ఎన్నికల్లో అభ్యర్థులు ఖర్చుల పర్యవేక్షణకు ఎనిమిది టీమ్‌లు, ఎనిమిది కమాండ్ కంట్రోల్ టీమ్‌లు వేశారు.

సర్వం సిద్ధం : విశాఖ జిల్లా ప్రధాన ఎన్నికల అధికారి మల్లికార్జున

ఎంవిపి.కాలనీ : 2024 సార్వత్రిక ఎన్నికల నియమావళి శనివారం మధ్యాహ్నం నుంచి అమల్లోకి వచ్చిందని, ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లూ చేసి సిద్ధంగా ఉన్నామని విశాఖపట్నం జిల్లా ప్రధాన ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున తెలిపారు. శనివారం సాయంత్రం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ విశాఖ జిల్లా పరిధిలోని ఏడు అసెంబ్లీ, ఒక పార్లమెంట్ నియోజకవర్గంలో ఎన్నికల నిర్వహణకు పూర్తి ఏర్పాట్లు చేశామని ఆయన తెలిపారు. 1991 పోలింగ్ కేంద్రాల్లో 19.71 లక్షల ఓటర్లు ఈ రోజు వరకు నమోదయ్యారని చెప్పారు. ఏప్రిల్ 20వ తేదీ వరకు నూతన అప్లికేషన్స్ స్వీకరించి వారికి ఓటు హక్కు కల్పిస్తామని తెలిపారు. ఎన్నికల నియమావళిలో భాగంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, ప్రాంగణాల్లో రాజకీయ నాయకుల ఫొటోలు, వారి ప్రచారానికి సంబంధించిన గుర్తులను 24 గంటల్లోగా తొలగించనున్నట్టు తెలిపారు. పబ్లిక్ ప్రదేశాల్లో స్కూల్స్, బస్టాండ్‌లు, ఇతర ప్రాంతాలలో 48 గంటల్లో తొలగిస్తామని అన్నారు. అధికారులు ఎవరూ రాజకీయ నాయకులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్‌లు, సమావేశాలు నిర్వహించరాదన్నారు. ఆదివారం నుంచి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఒక నూతన కాల్ సెంటర్‌ను, మీడియా సెల్‌ను, సోషల్ మీడియా సెల్‌ను ఏర్పాటు చేయనున్నామని, దీని ద్వారా ప్రజల సందేహాలను, ఫిర్యాదులను, సూచనలను తీసుకుంటామని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా 94 ఎన్‌ఫోర్స్‌మెంట్ టీంలను ఏర్పాటు చేశామన్నారు.

బహిరంగ సభకు తరలివెళ్లిన కాంగ్రెస్ శ్రేణులు

ప్రజాశక్తి-అనకాపల్లి

'విశాఖ ఉక్కు-తెలుగోడి హక్కు' పేరుతో విశాఖ స్టీల్ ప్లాంట్‌లో శనివారం జరిగిన కాంగ్రెస్ బహిరంగ సభకు ఎపిసిసి అధికార ప్రతినిధి ఐఆర్.గంగాధర్ నాయకత్వంలో పెద్ద ఎత్తున కాంగ్రెస్ శ్రేణులు తరలివెళ్ళారు. ఈ సందర్భంగా గంగాధర్ మాట్లాడుతూ విశాఖ స్టీల్ ప్లాంట్‌ని కాపాడుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ అనకాపల్లి పట్టణ అధ్యక్షుడు దాసరి సంతోష్, అనకాపల్లి మండల అధ్యక్షులు కట్టుమూరి నూక అప్పారావు, కశింకోట మండల అధ్యక్షుడు సనేడ గజ్జాలు, జిల్లా కార్యదర్శి ఎగ్గాడ భాస్కరరావు పాల్గొన్నారు.

వైసిపి పాలనలో సమగ్రాభివృద్ధి

ప్రజాశక్తి-దేవరాపల్లి : వైసిపి ప్రభుత్వ హయాంలో గతంలో ఎన్నడూ లేని విధంగా కోట్ల రూపాయలు వెచ్చించి గ్రామాలను సమగ్రంగా అభివృద్ధి చేసినట్లు ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు అన్నారు. మండలంలోని కొత్తపెంట, వాకపల్లి గ్రామాల్లో పలు అభివృద్ధి పనులను మంత్రి ప్రారంభించారు. వైసిపి ప్రభుత్వ అభివద్ధి, సంక్షేమానికి ప్రతీకగా సుమారు రూ.18 కోట్లతో నిర్మించిన పైలాన్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి కర్రి సత్యం, సర్పంచులు, ఎంపీటీసీలు, వైసిపి నాయకులు పాల్గొన్నారు

ఎమ్మెల్యేగా మరోసారి అవకాశం ఇవ్వండి

ప్రజాశక్తి -చోడవరం : చోడవరం నియోజకవర్గ ప్రజలు మరో సారి తనకు ఎమ్మెల్యేగా అవకాశం ఇవ్వాలని స్థానిక ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ కోరారు. చోడవరం వైసిపి అభ్యర్థిగా ప్రకటించిన తర్వాత శనివారం చోడవరం మండల వైసీపీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు వైసిపి ప్రభుత్వం చేసిందని, మరోసారి అవకాశం ఇస్తే మరింతగా అభివృద్ధి చేస్తానని అభ్యర్థించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి అసిరి వాసు గోవిందరావు, వైసిపి మండల అధ్యక్షులు దొడ్డి వెంకటరావు, సీనియర్ నాయకులు ఆనంద్, ఈశ్వరరావు, బొడ్డేటి సూర్యనారాయణ, సేనాపతి సత్యారావు, మార్కెట్ కమిటీ చైర్మన్ ఏడవకు సత్యారావు తదితరులు పాల్గొన్నారు.

టిడిపి అభ్యర్థి రాజు ప్రచారం

ప్రజాశక్తి-చోడవరం : చోడవరం నియోజకవర్గం టిడిపి అభ్యర్థి కెఎస్ఎన్ఎస్ రాజు శనివారం మండలంలోని రేవళ్ల గ్రామంలో ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ గతంలో ఎమ్మెల్యేగా పనిచేసి చోడవరం నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశామని, మరో సారి చేసే అవకాశాన్ని ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.మల్లు నాయుడు, మాజీ ఎంపీపీ జి వెంకట సత్యనారాయణ పాల్గొన్నారు.

ఎబిసిడబ్ల్యుఒగా కృష్ణారావు బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి అసిస్టెంట్ బిసి వెల్ఫేర్ ఆఫీసర్గా కె.కృష్ణారావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఉద్యోగోన్నతి పొంది పెందుర్తి నుంచి అనకాపల్లికి బదిలీపై వచ్చారు. ఇంత వరకు ఇక్కడ విధులు నిర్వహించిన గోపీనాథ్ నర్సీపట్నం బదిలీ అయ్యారు. అసిస్టెంట్ బిసి వెల్ఫేర్ ఆఫీసర్ పరిధిలో అనకాపల్లి, సబ్బవరం, పరవాడ, కసింకోట, చోడవరం మండలాల్లోని 13 బీసీ హాస్టళ్లు పనిచేస్తున్నాయి. కృష్ణారావును పలువురు అభినందించారు.

నూతన వ్యవసాయ విధానాలపై అవగాహన

ప్రజాశక్తి -వడ్డాది : కొండెంపూడి కృషి విజ్ఞాన కేంద్రం అధ్వర్యంలో జరిగే గ్రామీణ వ్యవసాయ అనుభవం కార్యక్రమంలో భాగంగా శ్రీకాకుళం కింజరాపు యర్రన్నాయుడు వ్యవసాయ కలశాల విద్యార్థినులు బంగారుమెట్ట గ్రామ ప్రజలకు శనివారం గ్రామాభివృద్ధి, నూతన వ్యవసాయ విధానాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం సభ్యులు డాక్టర్ రాజ్ కుమార్, డాక్టర్ ఎన్.కిషోర్ కుమార్, డాక్టర్ పి.బాబు వ్యవసాయ విద్యార్థినులు ఎంఎస్ఎస్.మధురిమ, ఎం.సోనీ, ఎల్.రత్నప్రశాంతి, సి.వాత్సల్య, వై.శ్రీవిష్ణు, కె.యమున రైతులు పాల్గొన్నారు.

ఊసరవెల్లి విన్యాసాలు

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

ఊసరవెల్లి మాదిరి అధికార, ప్రధాన ప్రతిపక్ష పార్టీలు ఎన్నికల్లో రంగులు మారుస్తున్నాయి. పొత్తులు, ఎత్తులతో ప్రజలను వంచించడానికి ముందుకొస్తున్నాయి. అధికారమే అజెండా తప్ప ప్రజల దైనందిన సమస్యలేవీ ఈ పార్టీలకు పట్టడం లేదు. తామేమీ చేయబోతున్నామో స్పష్టమైన, దీర్ఘకాలిక ప్రణాళిక ఈ పార్టీల్లో భూతద్దం పెట్టి వెతికినా కానరావడంలేదు. స్టీల్‌ప్లాంట్‌ను శత శాతం అమ్మకానికి పెట్టిన మోడీ ప్రభుత్వానికి జగన్ ప్రభుత్వం, ప్రతిపక్ష టిడిపి సహకరిస్తూ వచ్చాయి. ఇపుడు ఏకంగా రాష్ట్ర ప్రయోజనాలను వదిలిపెట్టి రాజకీయ లబ్ది కోసం టిడిపి, బిజెపి, జనసేన పొత్తు పెట్టుకున్నాయి. ప్రజలకు జరిగిన అన్యాయంపై నిలదీయాల్సిన, ప్రశ్నించాల్సిన పార్టీలు మోడీ ముందు చేతులు కట్టుకొని నిల్చున్నాయి. ఇంతవరకు అధినేతలు చెప్పినట్లు ఆడిన నాయకులు, పొత్తులో తమకు టికెట్లు రాక అన్యాయం అయిపోయామంటూ ఎదురు తిరుగుతున్నారు. తమదాకా వస్తేగానీ ఎదుట వాడికి జరిగిన అన్యాయం బాధ తెలీదన్నట్లు ఇపుడు జనసేన, బిజెపి నాయకులు తమకు అన్యాయం జరిగిందంటూ ప్రశ్నలు సంధిస్తున్నారు.

ఎంత సంధించినా ఎన్నికల మజిలీలో మర్మం విప్పిజెప్పి సీట్లు కేటాయించే పరిస్థితి ఆ పార్టీలకు లేకుండాపోయింది. టిడిపి సీనియర్ నాయకులు బండారు సత్యనారాయణ మూర్తికి రాజకీయంగా జరిగిన అన్యాయం ఆయనిక పూడ్చుకోలేనిది. ఆయన పోటీ చేయాలనుకున్న పెందుర్తి సీటును జనసేనకు అప్పజెప్పి వైసిపి నుంచి వచ్చిన పంచకర్ల రమేష్ బాబుకు కేటాయించారు. ఇలా ఆయన సీనియార్టీని అవమానపరిచారు. పవన్ కల్యాణ్ వ్యవహారశైలి నచ్చక అనకాపల్లి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పరుచూరి భాస్కరరావు జనసేనకు రాజీనామా చేశారు.

వైసిపి ఒంటరిగా బరిలో ఉన్నా, బిజెపిని పూర్తిగా వదిలివచ్చినట్లు లేదు. ఇప్పటికీ బిజెపిని భుజాన మోస్తోంది. స్టీల్‌ప్లాంట్ అమ్మకంపై మాట్లాడని, మాట్లాడలేని పార్టీలు నక్కజిత్తులతో ప్రజల ముందుకు రానున్నాయి. ఎన్నికల షెడ్యూల్ రావడంతో మాయ మాటలు, మొరటు వేషాలతో విన్యాసాలు చేయనున్నాయి. ప్రజలను వంచించే పార్టీలకు, గెలవడానికి నిస్సగ్గుగా ప్రలోభ పెట్టే అభ్యర్థులకు బుద్ధి చెప్పాల్సిన సమయం సమీపించింది. ప్రజల బాధలు పట్టని అభ్యర్థులను తలెత్తుకొని తిరగకుండా ఎన్నికల్లో పాఠం నేర్పడం, ప్రజల కోసం పనిచేసే పార్టీ అభ్యర్థులను పోటీచేసే చోట గెలిపించడం ప్రజల ముందున్న తక్షణ కర్తవ్యం.

వివిధ శాఖల అధికారులతో కో-ఆర్డినేషన్ సమావేశం

కో-ఆర్డినేషన్ సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పి మురళీకృష్ణ

ప్రజాశక్తి- అనకాపల్లి : స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో, జిఆర్‌పి, ఆర్‌పిఎఫ్, రవాణా శాఖ, ఆర్టీసీ తదితరశాఖల అధికారులతో జిల్లా పోలీస్ కార్యాలయంలో శనివారం ఎస్పి మురళీకృష్ణ కో-ఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలను ప్రలోభ పెట్టేందుకు నగదు, మద్యం, గంజాయి, ఉచిత కానుకలు పంపిణీ చేసేందుకు అవకాశం ఉందని పేర్కొన్నారు. అటువంటి కార్యకలాపాలపై ముందస్తు ప్రణాళిక ప్రకారం ప్రత్యేక నిఘా ఉంచి చెక్ పోస్టుల వద్ద ముమ్మర తనిఖీలు నిర్వహించాలని సూచించారు. ప్రజలు స్వచ్ఛందంగా తమ ఓటు హక్కును వినియోగించుకునేటట్లు, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు పటిష్ట చర్యలు తీసుకోవాలని కోరారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ బి.విజయభాస్కర్, డిటిఓ కెవి.ప్రకాశరావు, సెబ్ ఈఎస్ జయ సింహా చౌదరి, ఆర్‌పిఎస్ఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ అజయ్ నాందేవ్ సంసారి, సెబ్ ఏఈఎస్ డి.శైలజ రాణి, ఇన్‌స్పెక్టర్లు చంద్రశేఖర్, అప్పలనాయుడు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

జగన్‌ను ఉద్యోగులు నమ్మే పరిస్థితి లేదు

ప్రజాశక్తి-అనకాపల్లి : ఉద్యోగ, ఉపాధ్యాయుల పెండింగ్ బకాయిల విడుదల చేస్తామని, ఓపిఎస్ అమలు చేస్తామని అధికార పీఠం ఎక్కిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి, తరువాత వారిపైనే కక్షగట్టారని, అందువల్ల జగన్‌ను ఉద్యోగులు నమ్మే పరిస్థితి లేదని టిడిపి జిల్లా అధ్యక్షులు బుద్ధ నాగ జగదీశ్వరరావు అన్నారు. స్థానిక టిడిపి పార్లమెంటరీ పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ జనవరి డీఏ నగదు 2024 ఏప్రిల్ జీతంతో కలిపి మే నెలలో ఉద్యోగులకు ఇస్తారని జగన్ చెప్పడం చాలా విడ్డూరంగా ఉందన్నారు. ఐదు సంవత్సరాల కాలంలో గుర్తుకురాని డీఏలు ఇప్పుడు ప్రకటించడం ఎన్నికల స్టంటేనని పేర్కొన్నారు. సమావేశంలో రాష్ట్ర పెన్షనర్ అసోసియేషన్ కార్యదర్శి బుద్ధ కాశీ, నోబుల్ చారిటబుల్ ట్రస్ట్ గౌరవ అధ్యక్షులు కాంద్రేగుల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి అవార్డు అందుకుంటున్న ఎడియు డాక్టర్ జగన్నాధరావు, శ్రీదేవి

ఆర్ఎఆర్ఎస్‌కు జాతీయ అవార్డు

ప్రజాశక్తి-అనకాపల్లి : భారత వ్యవసాయ పరిశోధన మండలి, జాతీయ పంట కోత అనంతర సాంకేతిక పథకం లూథియానా జాతీయ స్థాయిలో ఈనెల 13 నుంచి 15 వరకు నిర్వహించిన 39వ వార్షిక జాతీయ సదస్సు సందర్భంగా ప్రకటించిన అవార్డుల్లో అనకాపల్లి అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం మూడో స్థానం దక్కించుకుంది. ఇప్పటికే ఆర్ఎఆర్ఎస్ బెల్లంపై చేసిన విశేష పరిశోధనలో అనేక మైలురాళ్లు దాటింది. మూడు పేటెంట్లు దక్కించుకుంది. మరో రెండు పేటెంట్లకు దరఖాస్తు చేసుకుంది. ఇటీవల కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన రూ.3.73 కోట్లతో నిర్మించిన ఇంక్యుబేషన్ సెంటర్ ద్వారా చెరకు చిరుధాన్యాల, పనస శుద్ధి చేసి విలువ ఆధారిత ఉత్పత్తులను తయారీకి శిక్షణ ఇస్తున్నారు. కాగా ఈ అవార్డును ఆర్ఎఆర్ఎస్ పరిశోధన సహ సంచాలకులు డాక్టర్ బివికె జగన్నాథరావు, వ్యవసాయ ఇంజనీర్ డాక్టర్ శ్రీదేవి అందుకున్నారు. ఈ సందర్భంగా వీరిని భారత వ్యవసాయ పరిశోధన మండలి శాస్త్రవేత్తలతో పాటు, ఆర్ఎఆర్ఎస్ శాస్త్రవేత్తలు అభినందించారు.

విగ్రహాలకు ముసుగు

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : ఎన్నికల కోడ్ ప్రకటించిన నేపథ్యంలో మండలంలోని దిబ్బడి, బుచ్చయ్య పేట తదితర గ్రామాల్లో ఉన్న ఎన్‌టి.రామారావు, వైఎస్.రాజశేఖర్‌రెడ్డి తదితరుల విగ్రహాలకు రెవెన్యూ అధికారులు శనివారం ముసుగులు వేశారు. రాజకీయ పార్టీల కటౌట్లను తొలగించారు.

గ్రామాల్లో టిడిపి సమావేశాలు

ప్రజాశక్తి-కశింకోట : మండలంలోని ఏనుగుతుని, నూతనగుంటపాలెం గ్రామాల్లో టిడిపి కార్యకర్తల సమావేశం శనివారం నిర్వహించారు. ఇందులో పాల్గొన్న టిడిపి నాయకులు ఉగ్గిని రమణమూర్తి, గొంతిన శ్రీనివాసురావు, నిమ్మదల సన్యాసినాయుడు మాట్లాడుతూ అనకాపల్లి అసెంబ్లీ ఉమ్మడి అభ్యర్థి కొణతాల రామకృష్ణ విజయానికి అందరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ బుదిరెడ్డి అప్పుడు, టిడిపి నాయకులు గొంతిని చిరంజీవి, అందె సన్యాసిరావు, నైనంశెట్టి రమణారావు, ఉల్లింగల రమేష్, జెర్రిపోతుల నూకునాయుడు, అందె రమణ, కలిగేట్ల సంజీవి, తిర్రి చిరంజీవి, నారిపల్లి ప్రసాద్ పాల్గొన్నారు.

టిడిపి నాయకులకు తగిన ప్రాధాన్యత

ప్రజాశక్తి-అనకాపల్లి : తెలుగుదేశం పార్టీకి గతం నుండి కష్టపడి పని చేస్తున్న అందరు నాయకులకు తగిన ప్రాధాన్యత ఇచ్చి గుర్తిస్తామని అనకాపల్లి టిడిపి, జనసేన, బిజెపి అభ్యర్థి కొణతాల రామకృష్ణ అన్నారు. స్థానిక గవరపాలెం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శనివారం 80, 81 వార్డుల బూత్ కన్వీనర్లు, యూనిట్ ఇన్చార్జి, ముఖ్య నాయకులతో మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ సమక్షంలో సమావేశం నిర్వహించారు. జీవీఎంసీ వార్డుల ఇన్‌ఛార్జిలు మల్ల సురేంద్ర, బొడ్డేడ జోగి నాయుడు స్థానికంగా ఉన్న సమస్యలను కొణతాలకు తెలియజేశారు. కొన్ని సంవత్సరాల నుండి తెలుగుదేశం పార్టీకి కష్టపడుతున్న కార్యకర్తల గురించి వివరించి, భవిష్యత్తులో వారి కష్టాన్ని గుర్తించి తగిన ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. దీనికి స్పందించిన కొణతాల రామకృష్ణ వారికి భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో అధిక స్థాయిలో తెలుగుదేశం పార్టీ నాయకులు, మహిళా నాయకులు పాల్గొన్నారు.

జాతీయ లోక్‌అదాలత్‌లో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి గిరిధర్

ఉచిత న్యాయ సేవలు వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - లీగల్ : బడుగు బలహీన వర్గాలకు న్యాయం చేసేందుకు కోర్టు కాంప్లెక్స్‌లో ఏర్పాటుచేసిన న్యాయ సేవాధికార సంస్థలను ప్రజలు ఉపయోగించుకుని ఉచిత న్యాయ సేవలు పొందాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ.గిరిధర్ సూచించారు. ఉమ్మడి విశాఖ జిల్లా వ్యాప్తంగా కోర్టు కాంప్లెక్స్‌ల్లో శనివారం జాతీయ లోక్ అదాలత్‌లు నిర్వహించినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 35 ప్రజా న్యాయ పీఠాలను ఏర్పాటుచేసి కక్షిదారులకు రాజీ చేకూర్చి వారికి వ్యయప్రయాస లేని న్యాయాన్ని అందించినట్లు వివరించారు. జిల్లా వ్యాప్తంగా 7840 సివిల్, క్రిమినల్ కేసులను రాజీకి అనువైనవిగా గుర్తించినట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఆలూరి శేషమ్మ తెలిపారు. ఈ లోక్ అదాలత్‌లో చెక్‌బౌన్స్, ఇన్సూరెన్స్, ప్రజా సంబంధ వ్యాజ్యాలు, కోర్టుల్లో పెండింగ్ ఉన్న 3426 కేసులను రాజీ చేయుటకు ప్రయత్నిస్తున్నట్లు వివరించారు.

రూ.16.42 కోట్లు పరిహారం

ఈ లోక్ అదాలత్‌లో పెండింగ్‌లోని సివిల్ కేసులు, రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులు పెద్ద ఎత్తున పరిష్కారమయ్యాయి. కక్షిదారులకు సుమారు రూ.16.42 కోట్లు నష్టపరిహారం కింద అందించారు. ఈ కార్యక్రమంలో మెట్రో కోర్టు సెషన్స్ జడ్జి శ్రీదేవి, న్యాయవాదుల సంఘం అధ్యక్షులు చింతపల్లి రాంబాబు, బార్ కౌన్సిల్ మెంబర్ బైపా అరుణ్‌కుమార్, అదనపు జిల్లా జడ్జిలు శ్రీధర్, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సమస్యలనడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే వెలగపూడి

12, 13 వార్డుల్లో బాబు ష్యూరిటీ...

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి 12, 13 వార్డుల్లో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా 12వ వార్డు టిడిపి ఇన్‌ఛార్జి ఒమ్మి అప్పలరాజు ఆధ్వర్యాన నిర్వహించిన పాదయాత్రలో ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు పాల్గొన్నారు. కొండవాలు ప్రాంతం దీనదయాల్‌పురం నుంచి పెదగదిలి, చినగదిలి ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి స్థానికులను ఆప్యాయంగా పలకరిస్తూ సమస్యలనడిగి తెలుసుకున్నారు. తెలుగుదేశం అధికారంలోకి రాగానే సింహాచలం భూముల క్రమబద్ధీకరణ చేయిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు గాడి సత్యం, పొత్రకండ ధర్మారావు, ఒమ్మి పోలారావు, ఏడువాక సన్యాసిరావు, బుడుమూరు గోవిందు, రాగతి అచ్చుతరావు, ముగడ రాజారావు, తురకపూడి బాలస్వామి, మజ్జి రమణి, నల్లాని వరలక్ష్మి, యల్లమిల్లి సురేష్ తదితరలు పాల్గొన్నారు.

పంచాయతీల్లో సోలార్ లైట్లు

ప్రజాశక్తి-పద్మనాభం : రాజ్యసభ సభ్యులు జివిఎల్ నరసింహారావు అభివృద్ధి నిధులతో జిల్లాలోని 68 పంచాయతీలకు సోలార్ లైట్లు మంజూరు చేశారు. ఒక్కొక్క పంచాయతీకి రూ.28 లక్షలు చొప్పున మంజూరు చేసినట్లు జిల్లా కలెక్టర్ పంచాయతీ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ నిధులు మంజూరైనట్లు జివిఎల్ నరసింహారావు కార్యదర్శి శ్రీనివాస్ తెలిపారు.

భీమిలి వైసిపి టికెట్ సిట్టింగ్‌కే...

ముత్తంశెట్టి అనుచరుల్లో ఆనందం

ప్రజాశక్తి-భీమునిపట్నం : మేలో జరుగనున్న ఎన్నికలకు సంబంధించి భీమిలి అసెంబ్లీ స్థానానికి సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్న ముత్తంశెట్టి శ్రీనివాసరావుకే వైసిపి అధిష్టానం టిక్కెట్ ఖరారు చేసింది. బుధవారం వైసిపి అధిష్ఠానం విడుదల చేసిన ఎమ్మెల్యే అభ్యర్థుల జాబితాలో భీమిలి అసెంబ్లీ స్థానానికి ముత్తంశెట్టి శ్రీనివాసరావు పేరు ఉండడంతో అతని అభిమానులు, అనుయాయుల ఆనందానికి అవధులు లేకుండా పోయింది. భీమిలి టికెట్ కోసం వైసిపి నుంచి ముత్తంశెట్టి శ్రీనివాసరావు మినహా మరోపేరు అధిష్ఠానం పరిశీలనలో లేకపోవడం, పార్టీ పిలుపు ఇచ్చిన కార్యక్రమాలను గడప గడపకు తీసుకెళ్లడం లాంటి వాటిలో ముందున్నట్లు పార్టీ అధిష్ఠానం భావించినందునే ముత్తంశెట్టికే మళ్లీ టిక్కెట్ ఇచ్చినట్లు అతని అభిమానులు అంటున్నారు.

2019లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో వైసిపి అభ్యర్థిగా ఇక్కడి నుంచే పోటీ చేసిన ముత్తంశెట్టి ఎమ్మెల్యేగా గెలుపొందారు. చావు తప్పి కన్ను లొట్టపోయిన చందాన గెలుపు సాధ్యమైంది. ఆ ఎన్నికల్లో ముత్తంశెట్టి శ్రీనివాసరావుకు 1,00,540 ఓట్లు వచ్చాయి. ప్రత్యర్థి టిడిపి అభ్యర్థి సబ్బం హరికి 91,598 ఓట్లు వచ్చాయి. టిడిపి అభ్యర్థిపై ముత్తంశెట్టి కేవలం 8,942 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. జనసేన అభ్యర్థి పంచకర్ల సందీప్‌కు అనూహ్యంగా 24,114 ఓట్లు వచ్చాయి.

మూడు పార్టీల కూటమి ఓ వైపు, వైసిపి ఒక్కటే మరో వైపు ఉండడంతో "ఎన్నికల యుద్ధం" గట్టిగా జరిగే అవకాశం ఉందంటున్నారు రాజకీయ పరిశీలకులు.

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చిన వివాదాస్పద పౌరసత్వ చట్టం (సిఎఎ) వల్ల తమ ఉనికి ప్రమాదంలోకి నెట్టబడ్డదన్న ఆందోళన ముస్లిం మైనారిటీల్లో నెలకొంది. సిఎఎ చట్టానికి వైసిపి, టిడిపి, జన సేన అనుకూలంగా ఉన్న విషయం విదితమే. ముస్లిం మైనారిటీల ఓటర్లు ఎటు వైపు మొగ్గు చూపుతారన్నది తెలియాల్సి ఉంది. సిఎఎ చట్టాన్ని వామ పక్షాలు, కాంగ్రెస్, మరికొన్ని పార్టీలు గట్టిగా వ్యతిరేకించిన నేపథ్యంలో భీమిలి అసెంబ్లీ ఎన్నికల్లో ఎంతో కొంత ప్రభావం ఉంటుందని పలువురు రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

'విభజన రాజకీయాలు చెల్లవు'

ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న కోరాడ రాజబాబు

ప్రజాశక్తి- భీమునిపట్నం : ప్రస్తుత ఎన్నికల్లో వైసిపి విభజన రాజకీయాలు ఇక చెల్లుబాటు కావని టిడిపి, జనసేన, బిజెపి నేతల ఆత్మీయ సమావేశం స్పష్టం చేసింది. స్థానిక బ్యాంక్ కాలనీలో శనివారం ఈ మూడు పార్టీల నియోజకవర్గ స్థాయి నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన టిడిపి నియోజకవర్గ ఇంఛార్జి కోరాడ రాజబాబు మాట్లాడుతూ, ఈ ఎన్నికల్లో విజయం తమ కూటమికే దక్కనుందని ఆశాభావం వ్యక్తంచేశారు. 2014లో కూడా బిజెపితో ఎన్నికల్లో కలిసి వెళ్ళి విజయం సాధించిన విషయాన్ని గుర్తుచేశారు. అప్పట్లో అధికారంలో టిడిపి ఉండగా ముస్లిం, మైనారిటీల భద్రతకు ఎ టువంటి ముప్పు వాటిల్లలేదు సరి కదా వారి సంక్షేమానికి తగిన ప్రాధాన్యత ఇచ్చామని స్పష్టం చేశారు. హజ్ యాత్ర మొదలు ముస్లిం తోఫా పేరిట నిత్యావసర సరుకులను అందజేసినట్లు తెలిపారు. క్రైస్తవులకు క్రిస్మస్ కానుకలు ఇచ్చామని వివరించారు.

జనసేన నియోజకవర్గ ఇంఛార్జి పంచకర్ల సందీప్ తన ప్రసంగంలో గత ఐదేళ్ల కాలంలో ఇక్కడ విభజన రాజకీయాలు నడిచినట్లు విమర్శించారు. అన్నదమ్ములు, కుటుంబాల మధ్య తగాదాలు సృష్టించి భయభ్రాంతులకు గురిచేసారని, ప్రజా సమస్యలు ప్రశ్నిస్తే పోలీసు కేసులు పెట్టారని అవేదన వ్యక్తంచేశారు. బిజెపి నియోజకవర్గ ఇంఛార్జి కె.రామానాయుడు మాట్లాడుతూ, దేశంలో ఎన్‌డిఎ, రాష్ట్రంలో మూడు పార్టీల కూటమి అధికారంలోకి రావడం తథ్యం అన్నారు. విభేదాలు ఉంటే పక్కన పెట్టి అభ్యర్థి ఎవరైనా విజయానికి కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో టిడిపి నియోజకవర్గ పరిశీలకులు కోట్ని బాలాజీ, పార్టీ మండల అధ్యక్షులు డిఎఎన్.రాజు, నాయకులు కాళ్ళ నగేష్‌కుమార్, కురిమిన లీలావతి, పతివాడ రాంబాబు, జనసేన ఒకటో జోన్ అధ్యక్షులు పరిమి భువనేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన గ్లకోమా వారోత్సవాలు

ప్రజాశక్తి-సీతమ్మధార : జిల్లా అంధత్వ నివారణ సంస్థ, ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్యశాల ఆధ్వర్యాన నిర్వహించిన ప్రపంచ గ్లకోమా అవగాహన వారోత్సవాలు ముగింపు కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ప్రాంతీయ నేత్ర వైద్యశాలలో ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమంలో ప్రాంతీయ నేత్ర వైద్యశాల ఇంఛార్జి సూపరింటెండెంట్ డాక్టర్ టి.జ్యోతిర్మయి మాట్లాడుతూ, వారం రోజులు గ్లకోమా అవగాహన కార్యక్రమాలు ఎక్కడెక్కడ నిర్వహించారో వివరించారు. ప్రతి రోజూ ప్రతి ఒక్కరికీ గ్లకోమా పట్ల అవగాహన కల్పించటం వైద్య ఉద్యోగులుగా మనందరి బాధ్యత అన్నారు. ఈ వారోత్సవాలు సందర్భంగా జూనియర్ వైద్యులకు, వైద్య విద్యార్థులకు గ్లకోమా అవగాహన కోసం వక్తృత్వ పోటీలు నిర్వహించి, ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రమణ, ఆర్‌ఎంఒ డాక్టర్ నవీన్‌కుమార్, డాక్టర్ వాణిశ్రీ, డాక్టర్ శ్రీలక్ష్మి, వైద్యులు, పిఎంఒలు ఉమాశ్రీనివాస్, సురేష్, సుబ్బలక్ష్మి, సుజాత, జూనియర్ వైద్య విద్యార్థులు, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు

రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు నీరు

రోడ్డుపైకి మురుగునీరు

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 27వ వార్డు పరిధి శంకరమఠం రోడ్డు జెకె టైర్స్ వెనుక రోడ్డులో డ్రెయినేజీ పొంగి రోడ్డు మురుగునీటిమయమైంది. ఈ రహదారిలో పాఠశాలలు, ప్రధాన షాపింగ్ మాల్స్ ఉండడం వాహనదారులు, పాదచారులు ఎక్కువగా ప్రయాణిస్తుంటారు. వీరంతా తీవ్ర దుర్వాసనతో ఇబ్బందులు పడ్డారు. జివిఎంసి అధికారులు స్పందించి వెంటనే డ్రెయినేజీ సమస్యను పరిష్కరించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

నేడు అనంత పద్మనాభస్వామి పెళ్లి రాట

ప్రజాశక్తి -పద్మనాభం : పద్మనాభం అనంతపద్మనాభ స్వామి పెళ్లి రాట ఉత్సవం ఆదివారం కుంతీ మాధవ స్వామి ఆలయ ప్రాంగణంలో గాలి గోపురం వద్ద నిర్వహించనున్నట్లు ఈవో నానాజీ బాబు తెలిపారు. ఆలయపురోహితులు సీతారామాంజనేయశాస్త్రి బృందం నిర్వహించే ఈ కార్యక్రమానికి గ్రామస్తులు, భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని ఈవో కోరారు. ఈ కార్యక్రమంతో స్వామివారి కల్యాణోత్సవాలు ప్రారంభమవుతాయని భక్తులు గమనించాలని కోరారు.

తాగునీటి బోర్లకు భూమి పూజ

ప్రజాశక్తి- పద్మనాభం: రాజ్యసభ సభ్యులు జివిఎల్ నరసింహారావు మంజూరు చేసిన నిధులతో మండలంలోని రెండు గ్రామాల్లో మూడు తాగునీటి బోర్లకు బిజెపి, తెలుగుదేశం, జనసేన పార్టీ నాయకులు శనివారం భూమి పూజ నిర్వహించారు. కొవ్వాడ పంచాయతీ, పాతకొవ్వాడ గ్రామ తమటపు వారి వీధిలో, అనంతవరం పంచాయతీ కేంద్రంలోని పద్మశాలీల వీధిలో, ముస్లిముల వీధిలో బోర్లకు శనివారం భూమి పూజచేశారు. ఒక్కొక్క బోరుకు ఎంపీ నిధుల నుంచి రూ.1.20 లక్షలు చొప్పున రూ.3.60 లక్షలు మంజూరు చేసినట్టు ఉమ్మడి పార్టీల నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు ఉప్పాడ అప్పారావు, పివి.ప్రసాదరావు పట్నాయక్, రెడ్డిపల్లి శ్రీనివాసరావు, మహంతి శ్రీనివాసరావు, పాలూరి కృష్ణారావు, కసిరెడ్డి దామోదర్‌రావు, కాళ్ళ సత్యనారాయణ, కురిమిన శ్రీనివాసరావు, పిన్నింటి సారథి తదితరులు పాల్గొన్నారు.

అపార్ట్‌మెంట్లలో సిసి కెమెరాలు

ప్రజాశక్తి-సీతమ్మధార : ప్రతి అపార్ట్‌మెంట్‌లో సిసి కెమెరాలు ఏర్పాటుచేసుకోవాలని నాలుగో పట్టణ సిఐ ఎస్.విజయకుమార్ సూచించారు. దొంగతనాలు నివారణపై దొండపర్తిలోని రామాలయం వద్ద అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సిసి కెమెరాలు ఉండడం ద్వారా దొంగతనాలకు పాల్పడే వారిని సులభంగా గుర్తించవచ్చని తెలిపారు.

మూడు గుడుల ముఖ ద్వార శంకుస్థాపన

ప్రజాశక్తి-సీతమ్మధార : అక్కయ్యపాలెంలో మూడు గుడులు ముఖద్వారానికి గౌరీ సేవా సంఘం అధ్యక్షులు కోయిలాడ వేణుగోపాల్ ఆధ్వర్యాన ఉత్తర నియోజకవర్గ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి కెకె.రాజు శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కెకె.రాజు మాట్లాడుతూ, ఇక్కడి మూడుగుడులకు చుట్టుపక్కల ప్రాంతాల్లో మంచి గుర్తింపు ఉందన్నారు. ముఖద్వార నిర్మాణానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జివిఎంసి ఫ్లోర్‌లీడర్ బాణాల శ్రీనివాసరావు, కార్పొరేటర్లు ఆళ్ల లీలావతి, ఉషశ్రీ, నాయకులు ఆడారి రవి, రాజగిరి అప్పారావు, ఆలయ పాలక మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అవంతిలో ముగిసిన వర్క్‌షాప్

ప్రజాశక్తి -తగరపువలస : డేటా సైన్స్ యూజింగ్, పైథాన్ అంశంపై బ్రెనో విజన్ కొలబరేషన్ విత్ ఎఐసిటిఇ సంస్థ సహకారంతో నాలుగు రోజుల పాటు జరిగిన వర్క్ షాప్ శనివారంతో ముగిసింది. ఈ కార్యక్రమంలో వర్క్ షాప్ కన్వీనర్ పి.శ్రీలక్ష్మి, ఫ్యాకల్టీ కో-ఆర్డినేటర్లు పి.సుదర్శనరావు, జి.రమాదేవి, ప్రిన్సిపల్ డాక్టర్ బి.మురళీకృష్ణ, డైరెక్టర్ డాక్టర్ ఎ.చంద్రశేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.

బహుమతులు పొందిన విద్యార్థులతో నాయకులు

విద్యార్థులకు బహుమతుల ప్రదానం

ప్రజాశక్తి-అనకాపల్లిడెస్క్: ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన పదవ తరగతి నమూనా పరీక్షలో అత్యధిక ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు నర్సీపట్నం ప్రభుత్వ బాలిక ఉన్నత పాఠశాలలో బహుమతులు ప్రధానం చేశారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు బి.బాబ్జి అధ్యక్షతన ఎంఈఓ తలుపులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రాజు, స్థానిక ప్రధానోపాధ్యాయురాలు మాధవి, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.ఫణీంద్ర కుమార్ హాజరయ్యారు. స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యా యురాలు మాధవి మాట్లాడుతూ, విద్యార్థులలో ఉన్న పరీక్షల భయాన్ని పోగొట్టేందుకు నమూనా పరీక్షలను నిర్వహించడం ఎంతో మంచిదన్నారు. ఈ కార్యక్రమంలో బాలికల పాఠశాల సీనియర్ ఉపాధ్యాయులు బాబురావు, ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు అరుణ్, సాయి, మనిధర్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ పున:నిర్మాణ పనులు ప్రారంభం

ప్రజాశక్తి-అనకాపల్లిడెస్క్: నర్సీపట్నంలోని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ పున:నిర్మాణ పనులను మున్సిపల్ వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణ శనివారం ప్రారంభించారు. 48 లక్షలు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ కృషి మేరకు నిధులు మంజూరు అయ్యాయి. దీంతో శనివారం లాంచనంగా పునర్నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పెదపాటి గోవిందరావు, వైస్ చైర్మన్ రాజా, జాయింట్ సెక్రెటరీ కుమార్, కౌన్సిలర్ వీరమాచినేని జగదీశ్వరి, వార్డు ఇన్‌చార్జ్ కణితి అన్నపూర్ణ, వైసిపి మున్సిపాలిటీ అధ్యక్షులు ఏకా శివ, జగనన్న సచివాలయాల కన్వీనర్ తమరాన శ్రీను, అయ్యరక కార్పోరేషన్ డైరెక్టర్ కర్రి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

IN THE HONOURABLE COURT OF THE VII SPECIAL MAGISTRATE AT VISAKHAPATNAM
C.C.3304/2023

Between:
Ganireddy Nagaraju ... Complainant
And:
Karumuri Appa Rao ... Accused

PROCLAMATION UNDER SECTION 82 OF CR.P.C.

Whereas the complaint has been made before the Honourable Court by the complainant against the Accused under section 138 NI Act and upon being satisfied that the accused are intentionally concealing themselves so that warrant cannot be executed against Accused, thereby the Honourable Court is pleased to issue this Proclamation hereby calling upon the accused viz., Karumuri Apparao, S/o. Late Ramu, residing at Quarter No. 131C, Sector-3, Ukkunagaram, Visakha patnam-31 requiring him i.e., the Accused to appear before the Honourable Court to answer the said complaint on the 21st day of March, 2024.

(By Order of the Court)
S.S. VASU,
Advocate
Madhauranagar,
Visakhapatnam.
Andhra Pradesh

IN THE HON'BLE COURT OF THE III ADDL. CHIEF METROPOLITAN MAGISTRATE AT: GAJUWAKA
C.C.251/2018

Between:
M/s. Shriram City Union Finanace Ltd, Gajuwaka Branch,
Rep by its Sr. Office Assistant
Sri K. Jagadeeswara Rao ...Complainant
And:
Dasari Sravani Lalitha Ganga Bhavani ...Accused

NOTICE

To,
The Accused:
Dasari Sravani Lalitha Ganga Bhavani
D/o.Rama Rao,Hindu,
R/at 6-66-8, Near Tent House,
Road No-6, Sramika Nagar,
Gajuwaka Police Station Back side,
Visakhapatnam District.

Please take notice that the above-named complainant filed the above C.C against you under Section 138 & 142 of NI Act., and the matter stands posted **22-03-2024** for your appearance. You are hereby required to appear before the Hon'ble Court either in person or through duly instructed Advocate **22-03-2024**at **10:30 A:M** in the above Hon'ble Court to answer all material questions, failing which the matter will heard and determined in your absence.

(By Order of the Hon'ble Court)
K.S.N. MURTHY,
Advocate
Gajuwaka, Visakhapatnam.

పక్కాగా ఎన్నికల కోడ్ అమలు

ఆర్‌ఒ గీతాంజలి

ప్రజాశక్తి-నక్కపల్లి: ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో పటిష్టంగా ఎన్నికల కోడ్ అమలు చేయాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి కె.గీతాంజలి సూచించారు. నక్కపల్లిలోని మండల పరిషత్ సమావేశ మందిరంలో శనివారం సెక్టోరియల్, మండల స్థాయి అధికారులు, పోలీస్ సిబ్బంది, రూట్ ఆఫీసర్లు, జోనల్ ఆఫీసర్లతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల విధులు, తీసుకోవాల్సిన చర్యలపై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆర్‌ఒ మాట్లాడుతూ, రాజకీయ నాయకుల బ్యానర్లు, కటౌట్లు, పోస్టర్లు హోర్డింగులు తొలగించాలని సూచించారు. విగ్రహాలను మూసివేయాలన్నారు. పాయకరావుపేట మండలంలోని శ్రీరాంపురం, ఎస్ రాయవరం మండలంలో అడ్డురోడ్, కోటవురట్ల మండలంలో లింగాపురం వద్ద స్టాటిక్ నిఘా బృందం ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఎన్నికలు సజావుగా ముగిసే వరకు బాధ్యతగా పనిచేయాలన్నారు. ఈ సమావేశంలో తహసీల్దార్‌లు శ్రీకాంత్, సూర్యనారా యణ, జానకి, వెంకటరమణ, ఎంపీడీవో శ్రీనివాస్, డిటి లు సత్యనారాయణ, కుమారస్వామి, ఆర్‌ఐ కన్నబాబు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఆర్‌ఒ

అల్లూరి, గంటం దొర సమాధులను బాగు చేయాలి

ప్రజాశక్తి-అనకాపల్లిడెస్క్: స్వతంత్ర సమరయోధుడు అల్లూరి సీతారామరాజు, గాం గంటం దొర సమాధులను మరమ్మతు చేయాలని జాతీయ అల్లూరి సీతారామరాజు యువజన సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పడాల వీరభద్రరావు కోరారు. శనివారం కృష్ణదేవిపేట అల్లూరి సీతారామరాజు పార్కులో అల్లూరి, గంటం దొర సమాధులు కు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అల్లూరి సమాధుల భవనం, స్లాబు పెచ్చులు ఊడి పడుతున్నాయన్నారు. ఈ ఐదేళ్ల పాలనలో కోటి పది లక్షలు అధికారింగా ప్రకటించి ఇప్పటికీ రూపాయి కూడా నిధులు మంజూరు చేయలేదని తెలిపారు. అల్లూరి పార్కు అభివృద్ధికి తక్షణమే నిధులు మంజూరు చేసి శిధిలమైన కట్టడాలను పునర్నిర్మించాలని, పర్యాటకులకు తాగునీటి సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అల్లూరి యువజన సంఘం రాష్ట్ర కార్యదర్శి అంబటి వరాహన రాజు, కార్యవర్గ సభ్యులు పంచాడ వెంకటరమణ, గంటం దొర కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

వెంకన్న ఉత్సవాలకు బందోబస్తు

ప్రజాశక్తి -నక్కపల్లి: ఉపమాక వెంకన్న వార్షిక తిరు కళ్యాణ మహొత్సవములు ఈనెల 19వ తేదీ నుండి ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు శనివారం సిఐ విజయ్ కుమార్ బందోబస్తు ఏర్పాట్లపై ఆలయ పరిసర ప్రాంతాలను పరిశీలించారు. కళ్యాణ ఉత్సవాలకు సంబంధించిన వివరాలను ఆలయ ప్రధాన అర్చకులు గొట్టుముక్కల ప్రసాదాచార్యులను అడిగి తెలుసుకున్నారు. ఉత్సవాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని సీఐ వెల్లడించారు .

ఆచార్యులతో మాట్లాడుతున్న సిఐ విజయ్ కుమార్

ఈశ్వరరావును సత్కరిస్తున్న జెడ్‌పిటిసి రాంబాబు

పిఎసిఎస్ అధ్యక్షునిగా ఈశ్వరరావు

ప్రజాశక్తి -వడ్డాది: వడ్డాది పిఏసిఎస్ అధ్యక్షుడిగా చిన్నప్పన్నపాలెం గ్రామానికి చెందిన కోవెల ఈశ్వరరావు నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం ఉదయం వడ్డాది పిఏసిఎస్ కార్యాలయంలో పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు పర్సన్ ఇన్చార్జిగా పని చేసిన దొండ సన్యాసిరావు తన వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేశారు. దీంతో డైరెక్టర్‌గా కొనసాగుతున్న ఈశ్వరరావుని పిఏసిఎస్ పర్సన్ ఇన్చార్జిగా ప్రభుత్వం నామినేట్ చేసింది. ఈ సందర్భంగా ఈశ్వరరావు మాట్లాడుతూ, తనను అధ్యక్షుడిగా నియమించిన ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసిల ఫోరం అధ్యక్షుడు దొండా రాంబాబు, వేతన కార్యదర్శి శాంతి, పిఏసిఎస్ డైరెక్టర్ పి కాశి, ఎం పి టి సి రమణ, హై స్కూల్ కమిటీ చైర్మన్ నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహానికి వాటర్ ఫిల్టర్ అందజేత

ప్రజాశక్తి-అనకాపల్లిడెస్క్: నర్సీపట్నం మున్సిపాలిటీ పెదబొడ్డేపల్లిలోని నిరాశ్రయుల వసతి గృహానికి పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) సమకూర్చిన వాటర్ ఫిల్టర్‌ను మున్సిపల్ వైస్ చైర్మన్‌లు కోనేటి రామకృష్ణ, తమరాన అప్పలనాయుడు శనివారం అందజేశారు. ఈ సందర్భంగా నిరాశ్రయులైన వృద్ధులకు ప్రత్యేక వైద్య శిబిరం వసతి గృహంలోనే ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వృద్దులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. అనంతరం పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ మాకిరెడ్డి బుల్లిదొర, నాయకులు భేతిరెడ్డి విజయ్ కుమార్, యాదగిరి శేషు, మెప్మా అధికారులు పాల్గొన్నారు.

వాటర్ ఫిట్టర్‌ను అందజేస్తున్న చైర్మన్లు

బస్తాలు అందజేస్తున్న నాయకులు

బియ్యం బస్తాల పంపిణీ

ప్రజాశక్తి -నక్కపల్లి: మండలంలోని రాజయ్యపేట గ్రామ సర్పంచ్ తనయుడు, వార్డు మెంబర్ పిక్కి కామేశ్వరరావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన మృతికి సంతాపంగా గ్రామానికి చెందిన టిడిపి- జనసేన నాయకులు కలిసి 30 మంది పేద కుటుంబాలకు ఒక్కొక్కరికి 25 కిలోల చొప్పున బియ్యం బస్తాలను గ్రామ సర్పంచ్ పిక్కి అప్పలనరస చేతుల మీదగా అందజేశారు. ప్రతి ఏటా ఆయన పేరిట సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పిక్కి కోదండరావు, పిక్కి గంగరాజు, పిక్కి సత్తియ్య, కొండలరావు, బాబుజీ పాల్గొన్నారు.

విద్యార్థులతో కోచింగ్ సిబ్బంది

సైనిక్ స్కూల్ ఫలితాల్లో...

వీనస్ కోచింగ్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి- మాడుగుల: సైనిక్ స్కూల్ ఫలితాలలో మాడుగుల వీనస్ కోచింగ్ సెంటర్ విద్యార్థులు ప్రతిభ చాటారు. ఈ మేరకు స్థానిక వీనస్ కోచింగ్ సెంటర్లో శనివారం ప్రతిభ చాటిన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా కరెస్పాండెంట్ తాళ్లపరెడ్డి నాగచంద్ర మాట్లాడుతూ, తమ ఇన్స్టిట్యూట్లో ఎనిమిది మంది విద్యార్థులకు కోచింగ్ ఇవ్వగా వారిలో ఐదుగురు సీటు పొందడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఇనిస్టిట్యూట్ సిబ్బంది ఆశ, చల్లా ప్రకాష్, విద్యార్థుల తలిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

జల్ జీవన్ మిషన్ పనులు ప్రారంభం

ప్రజాశక్తి-అనకాపల్లిడెస్క్: గొలుగొండ మండలం పాత మల్లంపేట పంచాయతీ శివారు పోలవరం, చంద్రయ్యపాలెం, పోలవరం, అంటుమానుజోరు గ్రామాల్లో శనివారం జల జీవన మిషన్ పనులకు స్థానిక సర్పంచ్ గడ్డం ఆదిలక్ష్మి ఆనంద్ భూమి పూజ చేసి ప్రారంభించారు. ఈ నిధులతో మూడు గ్రామాల్లోని సోలార్ మంచినీటి పథకాలు ఏర్పాటు చేసి ఇంటింటికి కొళాయి కలెక్షన్లు అందజేస్తామన్నారు. ప్రభుత్వం మంజూరు చేసిన ఈ నిధులతో పనులను త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులో తెస్తామని వైసిపి అధ్యక్షులు లెక్కల సత్యనారాయణ అన్నారు. ఈ కార్యక్రమంలో గొలుగొండ సర్పంచ్ కసిపల్లి అప్పారావు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై ఆరా

ప్రజాశక్తి- మాడుగుల: ముకుందపురంలో ప్రకృతి వ్యవసాయాన్ని చత్తీష్‌గడ్ రాష్ట్రం నుండి వచ్చిన బృందం పరిశీలించింది. ముకుందపురం గ్రామంలో గత నాలుగు సంవత్సరాలుగా ప్రకృతి వ్యవసాయంతో తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు పొందుతున్నారు చత్తీష్‌గడ్ రాష్టం నుండి ప్రదాన్ ఎన్జీఒ సంస్థ బృందం సభ్యులు రైతులను అడిగి తెలుసుకున్నారు. తక్కువ ఖర్చుతో మంచి ఆరోగ్యకరమైన పంటలు ఎలా పండించవచ్చని ఆరా తీశారు.

అడిగి తెలుసుకుంటున్న బృందం సభ్యులు

నేర నిర్ధారణలో ఫోరెన్సిక్ నిపుణుల పాత్ర కీలకం

ఎపి.హైకోర్టు న్యాయమూర్తి మన్మథరావు

ప్రజాశక్తి-మధురవాడ : సమాజంలో నేరప్రవృత్తి పెరగడంతో పాటు నేరస్తులు వికృతంగా తయారవుతున్నారని, వారిని గుర్తించి శిక్షలు పడేలా చేయడంలో ఫోరెన్సిక్ మెడిసిన్ నిపుణుల పాత్ర కీలకంగా మారుతోందని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.మన్మథరావు పేర్కొన్నారు. గీతం వైద్యకళాశాల జిమ్సర్‌లో శనివారం నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ అకాడమీ ఆఫ్ ఫోరెన్సిక్ మెడిసిన్ అండ్ టాక్సికాలజీ 5వ వార్షిక సమావేశాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. న్యాయస్థానాలు ఇచ్చే తీర్పుల వెనక ముఖ్యంగా క్రిమినల్ కేసులలో ఫోరెన్సిక్ మెడిసిన్ నిపుణుల నివేదికలు ఉపయోగపడుతున్నాయన్నారు. స్వయం నియంత్రణ, లోతైన పరిజ్ఞానం, సమాజం పట్ల బాధ్యతతో నిపుణులు కేసుల అధ్యయనంలో సహకరించాలన్నారు. ఉత్తమ న్యాయం కోసం సుప్రీం కోర్టును ఆశ్రయించే విధంగానే ఉత్తమ నివేదిక కోసం ఫోరెన్సిక్ మెడిసిన్ నిపుణులకు వ్యవస్థ ఉండాలని, నివేదికల ఖచ్చితత్వాన్ని అవి నిర్ధారించాలని పేర్కొన్నారు. ప్రముఖ ఫోరెన్సిక్ మెడిసిన్ నిపుణుడు డాక్టర్ జి.నాగిరెడ్డి మాట్లాడుతూ, వైద్య విద్యారంగం విస్తరిస్తోందని త్వరలో రాష్ట్రంలో జిల్లాకు ఒక ప్రభుత్వ కళాశాల ఏర్పాటవుతున్న నేపథ్యంలో వైద్య మౌలిక సదుపాయాలను పూర్తిస్థాయిలో ఉపయోగించుకోవాలన్నారు.

జిమ్సర్ వైద్య కళాశాల డీన్ డాక్టర్ ఎస్‌పి.రావు మాట్లాడుతూ, మెడికో లీగల్ కేసులలో ప్రైవేటు వైద్య కళాశాలలకు అవకాశం కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో జిమ్సర్ వైద్యకళాశాల ఫోరెన్సిక్ మెడిసిన్ అండ్ టాక్సికాలజీ విభాగం అధిపతి డాక్టర్ టివి.నాగరాజు, ఆంధ్రప్రదేశ్ అకాడమీ ఆఫ్ ఫోరెన్సిక్ మెడిసిన్ అండ్ టాక్సికాలజీ అధ్యక్షుడు డాక్టర్ ఫణీంద్ర తదితరులు పాల్గొన్నారు.

సమాజ నిర్మాణంలో యువత భాగస్వాములు కావాలి

ప్రజాశక్తి -ములగాడ : యువత మంచి అలవాట్లను కలిగి ఉండి, మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటూ ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని సెయింట్ ఆన్స్ కళాశాల కరస్పాండెంట్ సిస్టర్ గెసిల్లా సూచించారు. స్థానిక సెయింట్ ఆన్స్ జూనియర్ కళాశాల జాతీయ సేవా పథకం యూనిట్-1, యూనిట్ -2 ఆధ్వర్యంలో ఇందిరా కాలనీ, బర్మా కాలనీలో శనివారం ప్రత్యేక సేవా శిబిరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, యువత కోసం సమయం కేటాయించడం అంటే భవిష్యత్తుపై పెట్టుబడి పెట్టడమే అన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రాం అధికారి ఇపిఎస్.భాగ్యలక్ష్మి , ప్రోగ్రాం అధికారులు వై.అనసూయా దేవి, ఎ.సంధ్యారాణి మాట్లాడారు.

యూనిట్ -2 ఆధ్వర్యాన బర్మా కాలనీలో నిర్వహిస్తున్న సేవా శిబిరంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సిస్టర్ జానీస్ మాట్లాడుతూ, ఇతరుల కోసం చేసే సేవ మనలో శక్తిని రెట్టింపు చేస్తుందన్నారు. ప్రోగ్రాం అధికారి కుమారి నదియా మాట్లాడారు. అనంతరం జాతీయ సేవా పథకం కార్యక్రమాలపై చర్చలో వాలంటీర్లు పాల్గొన్నారు.

ఎన్నికల సజావు నిర్వహణకు చర్యలు

ప్రజాశక్తి-సీతమ్మధార : రానున్న సార్వత్రిక ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకున్నట్లు ఉత్తర నియోజకవర్గ ఎన్నికల అధికారి అఖిల తెలిపారు. ఉత్తర నియోజకవర్గంలో 272 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు. 1500 ఓట్లు కంటే ఎక్కువగా ఉన్న కేంద్రాలకు అదనంగా మరో మూడింటిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తాటిచెట్లపాలెం ఎఎస్ఆర్.నగర్‌లోని 61వ పిఎస్‌ను మోడల్ పోలింగ్ కేంద్రంగా గుర్తించినట్లు చెప్పారు. వృద్ధులు పోలింగ్ కేంద్రాలకు రాకుండా నేరుగా వారి వద్దకే బ్యాలెట్ తీసుకెళ్లే విధానంపై దృష్టి సారించినట్లు తెలిపారు. 85 ఏళ్లు కలిగిన వృద్ధులు నియోజకవర్గంలో సుమారు 500 మంది ఉన్నట్లుగా గుర్తించి బిఎల్‌ఒలు ద్వారా 12 డి దరఖాస్తు తీసుకెళ్లి వారి అంగీకారంతో బ్యాలెట్ తీసుకెళ్లి ఓటు వేయించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈసారి యువత ఓట్లు నాలుగువేలకుపైగా పెరిగాయని తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో అభ్యర్థుల కదలికలు, వారి ఖర్చులు తదితర అంశాలపై నిఘాపెట్టేందుకు 7 ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేశారని తెలిపారు. ఓటర్లను ప్రభావితం చేయడం, అల్లర్లు సృష్టించడం వంటి హింసాత్మక కేంద్రాలను గుర్తించి అందుకు అనుగుణంగా పోలీస్ బలగాలను నియమిస్తామన్నారు. ఓటు వేయడానికి వచ్చేవారికి ఇబ్బందులు తలెత్తకుండా విద్యుత్తు, మంచినీరు, మరుగుదొడ్లతో పాటు వికలాంగులకు వెళ్లేందుకు అనువుగా ఉండేలా ర్యాంపులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నియోజవర్గ పరిధిలో రౌడీషీటర్లు, అల్లర్లు చేసే అవకాశమున్న 30 మందిపై పోలీసులు బైండోవర్ చేసినట్లు పేర్కొన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగే విధంగా సహకరించాలని రాజకీయ పార్టీ నాయకులకు ఆమె విజ్ఞప్తి చేశారు.

ఘనంగా పొట్టి శ్రీరాములు జయంతి

ప్రజాశక్తి -యంత్రాంగం

అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని శనివారం పలుచోట్ల ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాలులర్పించారు.

భీమునిపట్నం : స్థానిక ఆదర్శ హిందీ ప్రేమీ మండలి ఆధ్వర్యాన భీమిలిలో శనివారం పొట్టి శ్రీరాములు జయంతి నిర్వహించారు. ముందుగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆదర్శ హిందీ ప్రేమీ మండలి గౌరవాధ్యక్షులు గంటా నూకరాజు, అధ్యక్షులు కెఎస్ఆర్.కృష్ణారావు, పలువురు విద్యార్థినులు పాల్గొన్నారు.

చీడికాడ:మండలంలో ని తురువోలు లో వాసవి క్లబ్ ఆధ్వర్యంలో అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తురువోలు ఉన్నత పాఠశాలలో జయంతి వేడుకలను నిర్వహించిన అనంతరం రావిచెట్టు జంక్షన్ వద్ద చలివేంద్రంను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు అప్పారావు, కార్యదర్శి నాగేశ్వరరావు, కోశాధికారి శ్రీను, సహాయ కార్యదర్శి రాము, మల్లికార్జునరావు, వెంకటేశ్వరరావు, వెంకటరావు, కోదండ రామయ్య పాల్గొన్నారు.

భాషా ప్రయుక్త రాష్ట్రాల ఆద్యుడు పొట్టి శ్రీరాములు

అనకాపల్లి : అమరజీవి పొట్టి శ్రీరాములు భాషా ప్రయుక్త రాష్ట్రాల ఆద్యుడని జిల్లా కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి అన్నారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ మందిరంలో శనివారం పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటం వద్ద జ్యోతి ప్రజ్వలన చేసి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర సాధన కొరకు 58 రోజులు ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణాలర్పించారని గుర్తు చేశారు. ఈ

పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అనకాపల్లి జిల్లా కలెక్టర్

కార్యక్రమంలో డిఆర్‌ఓ దయానిధి, డిడి బిసి వెల్ఫేర్ కె.రాజేశ్వరి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, కలెక్టరేట్ ఏవో, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో ఇన్చార్జ్ ఏడిఆర్ డాక్టర్ సిహెచ్ ముకుందరావు ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో చెరకు ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఆదిలక్ష్మి, శాస్త్రవేత్తలు విశాలాక్షి, భవాని, రామలక్ష్మి, ఉమామహేశ్వరరావు, గౌరీ పాల్గొన్నారు.

సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు బల్ల నాగభూషణం, పొట్టి శ్రీరాములు భవన నిర్మాణ నిర్వాహకులు పిఎంఎల్ నరసింహం ఆధ్వర్యంలో మెయిన్ రోడ్‌లో పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు నిర్వహించారు.

రాజ్యాంగం సక్రమ అమలుతోనే మనుగడ

సదస్సులో మాట్లాడుతున్న కెఎస్.చలం

ప్రజాశక్తి-సీతమ్మధార : మనుధర్మ శాస్త్రానికి వ్యతిరేకంగా అందరికీ సమాన హక్కులను కల్పించిన రాజ్యాంగం అమలు జరిగితేనే మనుగడ సాగించగలమని యుపిఎస్‌సి పూర్వ సభ్యులు, ఆల్ ఇండియా ప్రోగ్రెస్ ఫోరం జాతీయ అధ్యక్షులు ఆచార్య కెఎస్.చలం అన్నారు. దళిత హక్కుల పోరాట సమితి ఆధ్వర్యాన శనివారం రామా టాకీస్ సమీపంలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ భవన్లో 'మనువాదం-దళితులు- రాజ్యాంగం' అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 14 మంది మనువాదులు రాసిన మను గ్రంథాలు ఉన్నాయని తెలిపారు. వర్ణవివక్ష కులాలను ఏర్పాటు చేసింది మనుధర్మం అని తెలిపారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు లోకనాథం మాట్లాడుతూ, చట్టం ముందు అందరూ సమానమే అని రాజ్యాంగంలో ఉందని, దీన్ని బిజెపి ప్రభుత్వం మార్చాలని చూస్తోందని విమర్శించారు. సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి.సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ, బిజెపి ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మార్చేస్తారన్నారు. బిజెపి పాలకులు మనువాదాన్ని దేశంలో అమలు చేస్తున్నారని, అందుకు ఉదాహరణ పార్లమెంట్ భవనం ప్రారంభోత్సవానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్మును పిలవకపోవడమే కారణమన్నారు. దేశంలోని మెజార్టీ ప్రజలైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు 80 శాతం ఉన్నారని, వారిని పట్టించుకోకుండా బ్రాహ్మణ మనుధర్మాన్ని అమలు చేస్తున్నారని విమర్శించారు. ప్రధాని మోడీ అంబేద్కర్ పేరు జపిస్తారని, కాని ఆయన ఆశయాలను మాత్రం తుంగలో తొక్కుతున్నారని ఆరోపించారు. డిహెచ్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జెవి.ప్రభాకర్ మాట్లాడుతూ రాజ్యాంగం అమలు జరక్కుండా బిజెపి ప్రభుత్వం కుట్ర చేస్తోందన్నారు. డిహెచ్‌పిఎస్ అనకాపల్లి జిల్లా గౌరవాధ్యక్షులు డిసిహెచ్ రాజబాబు అధ్యక్షతన జరిగిన సదస్సులో కె.సుబ్బారావు, బొడ్డు కళ్యాణరావు, వి.శివప్రకాష్, కె.సుబ్బన్న, ఎస్.రాజులు, జి.రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

జ్ఞాన మందిరానికి భూమి పూజ

ప్రజాశక్తి-పెందుర్తి: మండలంలో జుత్తాడ గ్రామంలో శనివారం అహం బ్రహ్మాస్మి మహేశ్వర జ్ఞాన మందిరానికి భూమి పూజ నిర్వహించారు. ఈ సందరంగా శంకరరావు మాట్లాడుతూ శ్వాసతో ధ్యాన ప్రక్రియ చాలా సులభమన్నారు. మంచి ఆరోగ్యానికి, మనశ్శాంతికి, జీవితంలో పరిపూర్ణ జ్ఞానానికి దారితీసే ఆత్మ శక్తిని కాపాడుతుందని తెలిపారు. 18 మార్గదర్శక సూత్రాల నుంచి నేర్చుకోవలసిన ముఖ్యమైన అంశాలలో పిరమిడ్ పవర్ ఒకటి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సూర్యమాంబ, నారాయణరావు, లలిత, త్రిమూర్తి, కామేశ్వరరావు, సతీష్, సౌజన్య, డికె.రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి

ప్రజాశక్తి -మధురవాడ : పోతిన మల్లయ్యపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి చెట్టుకు ఉరివేసుకొని మృతి చెంది ఉన్నాడు. పిఎం.పాలెం సిఐ వై.రామకృష్ణ కథనం ప్రకారం... జివిఎంసి 6వ వార్డు పరిధి కె3 కాలనీకి చెందిన బి.రాంబాబు (32) కారు డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. శుక్రవారం విధులకు వెళ్లిన రాంబాబు రాత్రికి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు ఫోన్ చేస్తుంటే స్విచ్ ఆఫ్ అని వస్తోంది. దీంతో కంగారుపడిన కుటుంబీకులు పలుచోట్ల ఆరాతీసినా ఎటువంటి సమాచారమూ లేదు. శనివారం ఉదయం నవోదయ సమీపంలోని ఓ చెట్టుకు చున్నీతో ఉరి వేసుకొని వేలాడుతూ కనిపించాడు. మృతుని భార్య భూలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు సిఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కెజిహెచ్‌కు తరలించారు. నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు ఉంటాయని సిఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఆరుగురికి తీవ్రగాయాలు

ప్రజాశక్తి-చోడవరం : చోడవరం వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆరుగురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. లంకెలపాలెం మారేడుపూడి కాలనీకి చెందిన ఆటోలో చోడవరంలోని ఓ కార్యక్రమానికి వచ్చి తిరిగి వెళుతుండగా చోడవరం రోడ్డులో గోవాడ వద్ద వీరి ఆటోను కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అనపర్తి నాగేంద్ర, లక్ష్మి, కాళ్ల మల్లికా, దూది శివ, పోషణ సాయి, అనపర్తి ప్రణీత్, కాళ్ల ప్రకాష్‌రావు గాయపడ్డారు వీరిని అనకాపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

కెకె.రాజుకు టికెట్‌తో 'ఉత్తరం'లో ఆనందం

ప్రజాశక్తి-సీతమ్మధార : వైసిపి అధిష్టానం శనివారం ప్రకటించిన శాసనసభ అభ్యర్థుల జాబితాలో విశాఖ ఉత్తర నియోజకవర్గానికి కెకె.రాజు పేరును అధికారంగా ప్రకటించడంతో నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో పండగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా బాణాసంచా పేల్చి, మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ

కెకె.రాజును అభినందిస్తున్న అభిమానులు

సందర్భంగా కెకె.రాజు మాట్లాడుతూ, తనపై నమ్మకంతో ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించిన సందర్భంగా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి సహకారంతో రూ.435 కోట్లతో ఈ నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు, ఫ్లోర్ లీడర్, డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు, కార్పొరేషన్ డైరెక్టర్లు, నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొని కెకె.రాజుకు శుభాకాంక్షలు తెలిపారు.

ఎయును సందర్శించిన ఐసిసిఆర్ జోనల్ డైరెక్టర్

ప్రజాశక్తి-విశాఖపట్నం : ఆంధ్రవిశ్వవిద్యాలయాన్ని ఇండియన్ కౌన్సిల్ ఫర్ కల్చరల్ రిలేషన్స్ (ఐసిసిఆర్) జోనల్ డైరెక్టర్ ప్రదీప్‌కుమార్ శనివారం సందర్శించారు. ఎయు వీసీ ఆచార్య పివిజిడి ప్రసాదరెడ్డితో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ప్రదీప్‌కుమార్ మాట్లాడుతూ, ఎయు అందిస్తున్న సహకారం పట్ల హర్షం వ్యక్తం చేశారు. అత్యధిక శాతం మంది విదేశీ విద్యార్థులు ఎయులో చదువుకోవడానికి ఆసక్తి చూపుతున్నారని తెలిపారు. ఎయులో కల్పిస్తున్న వసతులు, బోధన తదితర అంశాలు వారిని ఆకట్టుకుంటున్నాయన్నారు.

వీసీ ఆచార్య పివిజిడి ప్రసాదరెడ్డి మాట్లాడుతూ, విదేశీ విద్యార్థుల సంఖ్యను 2 వేలకు పెంచడం లక్ష్యంగా మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నామని తెలిపారు. వారికోసం నూతన హాస్టళ్లను సైతం అందుబాటులోకి తెచ్చినట్లు చెప్పారు. ఎయుకు పెద్దసంఖ్యలో విదేశీ విద్యార్థులను పంపే ప్రక్రియలో సహకారం అందిస్తున్న ఐసిసిఆర్‌కి కృతజ్ఞతలు తెలిపారు. ఎయు నాక్ స్కోరింగ్‌లో 3.74 సిజిపిఎ సాధించి దేశంలోనే అత్యుత్తమ రెండు వర్సిటీలలో ఒకటిగా నిలచిందన్నారు. ఈ ర్యాంకింగ్ రానున్న ఏడు సంవత్సరాలకు కొనసాగుతుందన్నారు. ఇది వర్సిటీకి మరింత ఎక్కువ మంది విదేశీ విద్యార్థులు రావడానికి దోహదపడుతుందని తెలిపారు. అనంతరం ఎయు తరపున ప్రదీప్‌కుమార్‌ను సత్కరించారు. కార్యక్రమంలో ఎయు అంతర్జాతీయ విద్యార్థి వ్యవహారాల డీన్ ఆచార్య ఇఎన్.ధనుంజయరావు, అసోసియేట్ డీన్ ఆచార్య ఈశ్వర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా కాపునాడు జిల్లా కమిటీలు నియామకం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ప్రజా కాపునాడు సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం శనివారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో జరిగింది. ఈ సమావేశంలో విశాఖ, అనకాపల్లి జిల్లా కమిటీల ప్రతినిధులను నియమించారు. సంఘం అధ్యక్షులు యర్రంశెట్టి అంజిబాబు, ఉపాధ్యక్షులు రెడ్ల వీర రాఘవరావుల ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో విశాఖ జిల్లా అధ్యక్షులుగా మట్టా ప్రసాద్, అర్బన్ అధ్యక్షులుగా పాండ్రంకి వేంకటేశ్వరరావు, అనకాపల్లి జిల్లా అధ్యక్షులుగా గంగు నాయుడు, ప్రధాన కార్యదర్శిగా లగిసెట్టి సూర్యవెంకటప్రసాద్‌లను నియమించారు. వీరితో పాటు దేవరాపల్లి మండల అధ్యక్షులుగా కంచిపాటి రాజు, ఉపాధ్యక్షులుగా పెద్దాడ ఎరుకు నాయుడు, కొత్తవలస మండల ఉపాధ్యక్షులుగా శ్రీనివాసరావును నియమించారు. నూతనంగా నియమితులైన వారికి నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు శివాజీ, అల్లం రామానాయుడు పాల్గొన్నారు.

జానకిరామ్‌కు టికెట్ ఇవ్వాలని ధర్నా

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : మత్స్యకార సామాజిక తరగతికి చెందిన యువ నేత వాసుపల్లి జానకిరామ్‌కు విశాఖ దక్షిణ నియోజకవర్గం టికెట్ ఇస్తే, ఎమ్మెల్యేగా ఆయన్ని గెలిపించుకుంటామని వైసిపి అధిష్టానికి మత్స్యకార సంఘం నాయకులు విజ్ఞప్తి చేశారు. శనివారం ఫిషింగ్ హార్బర్ వద్ద వారంతా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మత్స్యకార సంఘం గౌరవాధ్యక్షులు వాడమోదుల పెంటయ్య మాస్టర్ మాట్లాడుతూ మత్స్యకారుల సమస్యలు జానకిరామ్‌కు తెలుసునన్నారు. విశాఖ కంటైనర్ టెర్మినల్ లిమిటెడ్ (విసిటిఎల్) స్థాపన మూలంగా ఎదురైన మత్స్యకారుల సమస్య మీద ఎమ్మెల్యే గణేష్ కుమార్ పట్టించుకోలేదని, ప్రభుత్వపరంగా సరైన న్యాయం చేయలేదని తెలిపారు. విసిటిఎల్ స్థాపనలో భూములు కోల్పోయిన స్థానిక మత్స్యకారులకు ఒప్పందం ప్రకారం ఉపాధి, ఉద్యోగాలు, నష్టపరిహారం దక్కలేదన్నారు. కార్యక్రమంలో మత్స్యకార సంఘం కార్యదర్శి చింతపల్లి అయ్యప్ప రాజు, ఎల్లాజీ, వలిశెట్టి కొరయ్య, గణేష్, వీర్రాజు, బొడ్డు చిన్నారావు పాల్గొన్నారు.

ఘనంగా గాయత్రి కళాశాల స్నాతకోత్సవం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : గాయత్రి విద్యా పరిషత్ డిగ్రీ అండ్ పీజీ (అటానమస్) కళాశాల 11, 12వ స్నాతకోత్సవాన్ని శనివారం గాయత్రి విద్యా పరిషత్ కళాశాల ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. ఆచార్య పిఎస్.రావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆంధ్ర విశ్వ కళాపరిషత్తు ఉపకులపతి ఆచార్య పివిజిడి.ప్రసాద్ రెడ్డి హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. గతంలోని తీయని జ్ఞాపకాలకు, భవిష్యత్తులోని బంగారు కలలకు మధ్య నిలిచిన అందమైన వంతెన గ్రాడ్యుయేషన్ అని అన్నారు. జీవితంలో ఎదురయ్యే సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొంటూ ముందుకు సాగాలన్నారు. గాయత్రి కళాశాల వైస్ ప్రెసిడెంట్ దక్షిణామూర్తి మాట్లాడుతూ కళాశాల ప్రగతిని వివరించారు. కళాశాల ప్రిన్సిపల్ ఎస్.రజిని వార్షిక నివేదికను చదివి వినిపించారు. 2021లో ఉత్తీర్ణులైన 875 మంది అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థులకు, 263 మంది పీజీ విద్యార్థులకు, 2022 విద్యా సంవత్సరంలో ఉత్తీర్ణులైన 901 మంది అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థులకు, 305 మంది పీజీ విద్యార్థులకు ఈ స్నాతకోత్సవంలో పట్టాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కళాశాల కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ అధికారి కె.మురళీ సోమేశ్వరరావు, గాయత్రి విద్యాపరిషత్తు సంస్థ యాజమాన్య సభ్యులు డివిఎస్.కామేశ్వరరావు పాల్గొన్నారు.

సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రమాద బాధితులకు ఎల్లప్పుడూ ప్రభుత్వం అండగా ఉంటుందని విశాఖ ఎంపీ, తూర్పు నియోజకవర్గం వైసిపి సమన్వయకర్త ఎంవివి.సత్యనారాయణ అన్నారు. శనివారం ఉదయం లాసన్స్ బే కాలనీలోని తన క్యాంపు కార్యాలయంలో పదో వార్డు వివేకానందనగర్ ప్రాంతానికి చెందిన కిడ్నీ వ్యాధి బాధితుడు తాలాడ శ్రీనుకు ఆయన ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రూ.75 వేల ఆర్థిక సహాయం చెక్కును అందజేశారు. కార్యక్రమంలో నాగవంశం కార్పొరేషన్ చైర్‌పర్సన్ బొడ్డు అప్పలకొండమ్మ, బొడ్డు అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

చిలకలూరిపేట సభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి -అనకాపల్లి : చిలకలూరిపేట బహిరంగ సభను జయప్రదం చేయాలని టిడిపి, బిజెపి, జనసేన పార్టీల జిల్లా అధ్యక్షులు బుద్ధ నాగ జగదీశ్వరరావు, ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, పంచకర్ల రమేష్ బాబు పిలుపునిచ్చారు. స్థానిక తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యాలయంలో శనివారం విలేకర్లతో మాట్లాడుతూ గడిచిన ఐదేళ్లలో ప్రజలు అనుభవించిన నరకాసుర పాలన నుండి విముక్తి కోరుకుంటున్నారని తెలిపారు. ప్రధాని మోడీ, చంద్రబాబు, పవన్ కళ్యాణ్ పాల్గొనే ప్రజాగలం సభను విజయవంతం చేయాలని కోరారు.

టెన్త్ పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ ఆంధ్రప్రదేశ్ పరీక్షల షెడ్యూల్ ప్రకారం ఈ నెల 18 నుంచి 30వ తేదీ వరకు పదో తరగతి పరీక్షలు జరగనున్నాయని, ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు ప్రతి రోజూ ఒక పేపర్ ఉంటుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున పేర్కొన్నారు. ఈ పరీక్షలకు విశాఖ జిల్లా నుంచి 31,379 మంది విద్యార్థులు హాజరవుతున్నారని, వారిలో 28,367 మంది రెగ్యులర్‌వారు కాగా, 3,012 మంది ప్రైవేట్ విద్యార్థులు ఉన్నారని వివరించారు. రెగ్యులర్ విద్యార్థుల్లో 14,972 మంది బాలురు, 13,395 మంది బాలికలు హాజరవుతున్నారని పేర్కొన్నారు. ఈ మేరకు జిల్లాలో పటిష్ట ఏర్పాట్లు చేశామని తెలిపారు. కలెక్టరేట్ వీసీ హాలులో శనివారం మధ్యాహ్నం స్కూల్ ఎడ్యుకేషన్ ఆర్‌జెడి, డిఇఒలతో కలిసి జిల్లా కలెక్టర్ విలేకరుల సమావేశం నిర్వహించారు. పదో తరగతి పరీక్షల షెడ్యూల్, ఇతర ఏర్పాట్ల గురించి వివరించారు. పరీక్షల నిర్వహణ కోసం 138 పరీక్షా కేంద్రాలను గుర్తించామని వాటిలో 48 'ఎ' కేటగిరీ కేంద్రాలు, 81 'బి' కేటగిరీ కేంద్రాలు, 09 'సి' కేటగిరీ కేంద్రాలు ఉన్నాయని పేర్కొన్నారు. స్టోరేజీ కోసం 33 పోలీస్ స్టేషన్ పాయింట్లను గుర్తించామని చెప్పారు. 14 రూట్‌లు ఏర్పాటు చేశామని, ఐదుగురితో ఫ్లయింగ్ స్క్వాడ్‌లను నియమించామని వెల్లడించారు. జిల్లాలో ఎటువంటి సమస్యాత్మక కేంద్రాలూ లేవని స్పష్టం చేశారు. సమావేశంలో స్కూల్ ఎడ్యుకేషన్ ఆర్‌జెడి విజయ భాస్కర్, డిఇఒ ఎల్.చంద్రకళ పాల్గొన్నారు

18 నుంచి ఒంటిపూట బడులు

ఈ నెల 18 నుంచి ఒకటో తరగతి నుంచి తొమ్మిదో తరగతి వరకు ఒంటిపూట బడులు నిర్వహించనున్నట్లు కలెక్టర్ మల్లికార్జున తెలిపారు. ఉదయం 7.45 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు అన్ని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలు నిర్వహించాలని స్పష్టం చేశారు. ఎస్ఎస్‌సి. రెగ్యులర్ పరీక్షా కేంద్రాలను కలిగి ఉన్న పాఠశాలల్లో తరగతులను మధ్యాహ్న సెషన్‌లో మాత్రమే నిర్వహించాలన్నారు. సాధారణ ఎస్ఎస్‌సి, ఓపెన్ స్కూల్ పరీక్షా కేంద్రాలు రెండింటినీ కలిగి ఉన్న ఒకటి నుంచి తొమ్మిదో తరగతి వరకు నిర్వహించే పాఠశాలలకు 18వ తేదీ నుంచి సెలవులు ప్రకటించాలని ప్రభుత్వం నిర్ణయించిందని పేర్కొన్నారు.

ఆర్‌టిసిలో ఉచిత ప్రయాణం

విశాఖ కలెక్టరేట్ : పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించినట్టు జిల్లా ప్రజా రవాణా అధికారి ఎ.అప్పలరాజు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. విశాఖ జిల్లా పరిధిలోని అన్ని పరీక్షా కేంద్రాల వద్దకు విద్యార్థులు బస్సు పాస్ లేనప్పటికీ హాల్ టికెట్ చూపించి ప్రయాణం చేయవచ్చునని తెలిపారు. పరీక్షకు హాజరైన విద్యార్థులు తిరిగి వారి ప్రాంతాలకు వెళ్లేందుకు వీలుగా పరీక్షా కేంద్రాల వద్ద నుంచి ఆర్టీసీ బస్సులను నడుపుతున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు.

నక్కపల్లి: ఈనెల 18వ తేదీ నుండి ప్రారంభం కానున్న పదో తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఎంఈఓ కే నరేష్ తెలిపారు. మండలంలో నక్కపల్లి బాలురు, గురుకుల పాఠశాల, గురూస్ స్కూల్, గొడిచెర్ల, వేంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో

ఏర్పాట్లపై సమీక్షిస్తున్న విశాఖ కలెక్టర్ మల్లికార్జున

తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసామన్నారు. శనివారం ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు.

దేవరాపల్లి : మండలంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని మండల విద్యాశాఖ అధికారి పడాల్ దాస్ తెలిపారు. శనివారం ఆయన స్థానిక ఎంఈఓ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని దేవరపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, తెలుగుపూడి గురుకుల పాఠశాలల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. దేవరాపల్లిలో 230 మంది, తెలుగుపూడిలో 213 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారని చెప్పారు. ఇందు కోసం దేవరాపల్లిలో 10 గదులు, తెనుగుబూడిలో 9 గదులు, వాటన్నింటిలో ఫర్నిచర్, ఫ్యాన్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

కె.కోటపాడు : మండలంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈఓ సత్యనారాయణ తెలిపారు. స్థానిక విద్యాశాఖ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మండల కేంద్రం కె.కోటపాడు జెడ్‌పి హైస్కూల్, అయ్యన్న ఇంగ్లీష్ మీడియం స్కూల్, ఎ.కోడూరు జెడ్‌పి హైస్కూల్‌లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మూడు సెంటర్లలో మొత్తం 572 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారని, మరో 21 మంది ప్రైవేటు విద్యార్థులు కూడా పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. ఉదయం 9.30 గంటలకు పరీక్షలు ప్రారంభం కానున్నాయని చెప్పారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 కె.ప్రసాద్, హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

పాడేరు: ఈనెల 18 నుంచి 30వ తేదీ వరకు పదో తరగతి పరీక్షలు జరగనున్నాయని జిల్లా కలెక్టర్ ఎం.విజయ సునీత తెలిపారు. కలెక్టరేట్ వీసీ హాలులో శనివారం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లా నుంచి 12,051 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారని, ఈ మేరకు జిల్లాలో పటిష్ట ఏర్పాట్లు చేశామని కలెక్టర్ తెలిపారు. కేంద్రాల్లో అన్ని రకాల మౌలిక వసతులు కల్పించామన్నారు. ఈ సమావేశంలో జిల్లా విద్యా శాఖాధికారి పి.బ్రహ్మాజీ, గిరిజన సంక్షేమ ఉప సంచాలకులు ఐ.కొండలరావు, ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ వై.వినయ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఆనందపురం : మండలంలో ఈ నెల 18 నుంచి ఏప్రిల్ 2వ తేదీ వరకు జరిగే పదో తరగతి పరీక్షల నిర్వహణకు విద్యాశాఖ అన్ని రకాల ఏర్పాట్లూ పూర్తిచేసినట్లు ఎంఇఒ పద్మావతి తెలిపారు ఆనందపురంలో 1068 విద్యార్థులకు గాను ఐదు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసామన్నారు.

సెంట్రల్ పార్క్‌లో రూ.2.27 కోట్లతో లెడ్ గ్లో గార్డెన్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో ఉన్న వైఎస్ఆర్ సెంట్రల్ పార్క్‌లో రూ.2 కోట్లా 40 లక్షలతో నిర్మించనున్న లెడ్ గ్లో గార్డెన్ పనులకు శనివారం ఉదయం విఎంఆర్‌డిఎ ఛైర్మన్ సనపల చంద్రమౌళి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లెడ్ గ్లో గార్డెన్ పార్క్ ఏర్పాటు విశాఖకే తలమానికం కానుందన్నారు. అందులో ఏర్పాటు చేసే వివిధ పక్షులు, జంతువుల లెడ్ కళాకృతులు చూపరులను అమితంగా ఆకట్టుకుంటాయన్నారు.

ఈ కార్యక్రమంలో శాసన మండలి సభ్యురాలు వరుదు కల్యాణి, కార్పొరేటర్ బిపిన్ కుమార్ జైన్, విఎంఆర్‌డిఎ జాయింట్ కమిషనర్ రవీంద్ర, కార్యదర్శి కీర్తి, సిఇ భవానీ శంకర్, ఎస్ఇ బలరామ రాజు, రేంజర్ శ్యామల, కార్యనిర్వాహక ఇంజినీర్లు ఎస్‌విఎస్ఎన్.రాజు, బొట్టా శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉక్కును అమ్మకానికి పెట్టిన బిజెపిని ఓడించాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : లక్ష మందికి ఉపాధి కల్పిస్తున్న ప్రభుత్వ రంగంలోని విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కార్పొరేట్ సంస్థలకు అమ్మకానికి పెట్టిన బిజెపిని రానున్న ఎన్నికల్లో చిత్తుగా ఓడించాలని సిఐటియు కంచరపాలెం జోన్ కార్యదర్శి ఒ.అప్పారావు పిలుపునిచ్చారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యంలో చేపట్టిన రిలేదీక్షలు శనివారానికి 1101 వ రోజుకు చేరాయి. దీక్షల్లో కంచరపాలెం జోన్ సిఐటియు నాయకులు కూర్చున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ రక్షణ కోసం మూడేళ్లకుపైగా ఉద్యమం సాగుతోందని, అయినప్పటికీ కేంద్ర ప్రభుత్వంలో ఎటువంటి మార్పు రాలేదని అన్నారు. రాష్ట్రంలోని వైసిపి, టిడిపి, జనసేన పార్టీలు బిజెపితో అంటకాగుతూ ఆంధ్రప్రదేశ్ ప్రజలకు, ముఖ్యంగా ఉత్తరాంధ్ర ప్రజలకు తీరని ద్రోహం చేస్తున్నారని విమర్శించారు. ఈ ఎన్నికల్లో ఆ పార్టీలకు కూడా ప్రజలు గుణపాఠం చెప్పాలని విజ్ఞప్తి చేశారు. దీక్షల్లో రామచంద్రుడు, ఎం.ఈశ్వరరావు, అప్పారావు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులు ట్రాఫిక్‌లో చిక్కుకోకుండా చూడండి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఈ నెల 18 నుంచి 30 వరకు రాష్ట్ర వ్యాప్తంగా జరగనున్న పదో తరగతి పరీక్షలకు సంబంధించి విద్యార్థులు ట్రాఫిక్‌లో చిక్కుకోకుండా చూడాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం ఆదేశించారు. ఈ మేరకు ఆయన శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో పరీక్ష రాసే విద్యార్థులు వారి తల్లిదండ్రులతో కలిసి ద్విచక్ర వాహనాలు, కార్లు ద్వారా సెంటర్లకు వెళ్లేముందు కేసులు బుక్ చేయడం, ఆకస్మికంగా పోలీసులు ఆపడం వంటి చర్యలు చేపట్టొద్దని సూచించారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా తగు చర్యలు చేపట్టాలని కోరారు.

ఇళ్ల స్థలాల కోసం జర్నలిస్టుల ధర్నా

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : జర్నలిస్టులకు జిఒ 535 ప్రకారం నామమాత్రపు ధరకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ శనివారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద జర్నలిస్టుల సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లోకల్ న్యూస్ పేపర్స్ అసోసియేషన్ అధ్యక్షులు పి.సత్యనారాయణ, జాబ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కెఎం.కీర్తనరావు, ఎపియుడబ్ల్యూజె జిల్లా ప్రధాన కార్యదర్శి కె.చంద్రమోహన్ మాట్లాడారు. సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, ఐఎఫ్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.వెంకటేశ్వర్లు పాల్గొని మద్దతు తెలిపారు. జర్నలిస్టుల సంఘాల నాయకులు మాట్లాడుతూ హర్యానా, కేరళ, గోవా, అస్సాం, పాండిచ్చేరి, బీహార్, తమిళనాడు తదితర రాష్ట్రాల మాదిరిగానే 58 ఏళ్లు దాటిన జర్నలిస్టులకు నెలకు.రూ.10 వేలు చొప్పున పెన్షన్ ఇవ్వాలన్నారు.

నేడు 'నిద్రలేమి - కలత నిద్ర' అంశంపై సదస్సు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : వరల్డ్ స్లీప్ డేని పురస్కరించుకొని ఆదివారం ఉదయం డాబా గార్డెన్స్‌లోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో 'నిద్రలేమి కలత నిద్ర' అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నామని కౌసల్య కౌన్సిలింగ్ సెంటర్ నిర్వాహకులు, మానసిక వైద్య నిపుణుడు ఎన్‌జి.నిహాల్ తెలిపారు. ఈ మేరకు ఆయన శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. అందరికీ కడుపునిండా తిండి, కంటి నిండా నిద్ర తప్పనిసరని పేర్కొన్నారు. నిద్ర లేకపోతే ఎక్కడా శాంతి లభించదని తెలిపారు. వరల్డ్ స్లీప్ డేని పురస్కరించుకొని తలపెట్టిన అవగాహనా సదస్సుకు ప్రధాన వక్తగా

డాక్టర్ నిహాల్

ప్రభుత్వ మానసిక వైద్యశాల పూర్వ సూపరింటెండెంట్ డాక్టర్ ఎన్ఎన్.రాజు హాజరుకానున్నారని తెలిపారు. మనిషి తన జీవితంలో మూడో వంతు సమయాన్ని నిద్రలోనే గడుపుతారని, ప్రతి ఒక్కరికీ రోజుకు 7 నుండి 8 గంటల సుఖ నిద్ర అవసరమని తెలిపారు. కొంతమంది వివిధ కారణాల వల్ల నిద్ర సమయం తగ్గించి అనారోగ్యం పాలవుతున్నారని పేర్కొన్నారు. నిద్ర ద్వారా శరీరంలో అనేక మార్పులు వస్తాయని తెలిపారు. నిద్రలో మెదడు ప్రధాన పాత్ర పోషిస్తుందని, శరీరంలో అన్ని వ్యవస్థలనూ నియంత్రించే కేంద్రం మెదడని, అందులో నిక్షిప్తమైన జీవ గడియలు వివిధ విద్యుత్ రసాయన మార్పుల ద్వారా అంతర్గత సమతౌల్యాన్ని సమన్వయ పరుస్తాయని తెలిపారు. నిద్రలేమి వల్ల తలెత్తే సమస్యలను వివరించారు.